PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 35 | విజయవాడ, సోమవారం 4 సెప్టెంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 4 September 2023 | Rs

సాగు అంతంతే..!

- వర్షాభావంతో ఉమ్మడి కర్నూలులో ఎండిపోతున్న పంటలు
- సాధారణం కన్నా 50 శాతం లోటు

లోపలి పేజీలో..

జనం మధ్యకు... చిరుతలెందుకు..?

- భయాందోళనలో 'శ్రీవారి' యాత్రికులు



లోపలి పేజీలో..

వర్షాల వారం



- ఏడు వరకూ రాష్ట్రవ్యాప్తంగా వానలు
- ఐఎండి వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బంగాళా ఖాతంలో ఏర్పడ్డ ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో ఈ నెల 7 వరకు సాధారణం నుండి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం వుందని వాతావరణ శాఖ పేర్కొంది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం వుందని ప్రజలు అప్రమత్తంగా వుండాలని సూచించింది. పశ్చిమ, మధ్య బంగళాఖాతంలో రాష్ట్రానికి సమీపంలో సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని ఐఎండి అంచనా. దీని ప్రభావంతో సోమవారం నుండి వాయువ్య బంగళాఖాతంలో మరో ఆవర్తనం ఏర్పడే అవకాశం వున్నందున ఈ నెల 7వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం వుందని పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో గాలులు బలంగా వీచే అవకాశం ఉందని అంచనా వేశారు. రాయలసీమలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం వుందని పేర్కొంది. శ్రీసత్యసాయి, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో వర్షాలు పడనున్నాయని పేర్కొంది.

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆగస్ట్ నెలంతా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సెప్టెంబరులో కురిసే వానాలపై రైతన్న గంపెడు ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఆగస్టులో రాష్ట్ర సగటు వర్షపాతం 165 మిల్లీ మీటర్లు కాగా కేవలం 74.4 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసింది. జులైలో కురిసిన వర్షాలకు సాగుచేసిన ఖరీఫ్ పంటలు ఆగస్టులో వర్షాభావం వల్ల చాలా ప్రాంతాల్లో ఎండిపోయి రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే జూన్ నుండి ఇప్పటిదాకా సగటున 409 మిల్లీ మీటర్ల వర్షపాతం కురవాల్సి వుండగా కేవలం 287 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. ఈ నేపథ్యంలో సెప్టెంబరులలో కురిసే వర్షాలతో కనీసం ప్రత్యామ్నాయ పంటలు అయినా సాగుచేసుకునే అవకాశం వుందని అధికారులు అంటున్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

- రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు
- కొనసాగిన సిపిఎం సమరభేరి

కార్డ్‌ప్రైమ్ 2.0తో అన్నీ కడగండ్లే

- దస్తావేజు లేఖరుల ఆందోళన
- రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద 14న ధర్నాలు
- 15న కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు

లోపలి పేజీలో..

ఒడిశాలో పిడుగుల వర్షం

- 12 మంది మృతి



భువనేశ్వర్‌లో జలమయమైన రహదారిపై జాగ్రత్తగా వెళ్తున్న వాహనదారులు

భువనేశ్వర్ : ఒడిశాలో భారీ వర్షాలు, పిడుగులు బీభత్సం సృష్టించాయి. పిడుగులు పడి వేర్వేరు ప్రాంతాల్లో 12 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. మరణించిన వారిపై ఆధారపడిన కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఖుర్దా జిల్లాలోనే నలుగురు మరణించగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బోలన్‌గిర్‌లో ఇద్దరు, అంగుల్, బౌద్, జగత్‌సింగ్‌పూర్, దేన్‌కనాల్, గజపతి, పూరీ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. ఒడిశా తీర ప్రాంతంతో పాటు జంట నగరాలైన భువనేశ్వర్, కటక్ పట్టణాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రాబోయే నాలుగు రోజుల పాటు ఒడిశా వ్యాప్తంగా భారీ నుంచి అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) హెచ్చరించింది. తుపానుతో పాటు రుతుపవనాలు కూడా తోడవడంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయని తెలిపింది. నారాజ్‌లో 13 సెంటీమీటర్లు, పిపిలిలో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే సమయంలో ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని సూచించింది. చెట్లు, నీటి వనరులకు దూరంగా ఉండాలని కోరింది.

దేశంలో సాగునీటి వనరుల్లో

మూడొంతులకు విద్యుత్తే ఆధారం

మైనర్ ఇరిగేషన్ సెన్సస్ (ఎంఐసి) వెల్లడి



న్యూఢిల్లీ : దేశంలో నీటిపారుదల వనరుల్లో నాలుగింట మూడొంతులకు విద్యుతే ఆధారం. విద్యుత్‌తో ముడిపడి వున్న సాగునీటి వనరులపైనే రైతులు ఎక్కువగా ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. మైనర్ ఇరిగేషన్ సెన్సస్ (ఎంఐసి) తాజా ఎడిషన్ ఈ విషయాన్ని వెల్లడించింది. రైతులు, ఇతర ప్రైవేట్ యాజమాన్యం వినియోగించే బోర్‌వెల్‌లు, ట్యూబ్‌వెల్‌లు విద్యుత్‌పై ఆధారపడుతున్నాయని నివేదిక తెలిపింది. నీటిని వెలికి తీయడానికి డీజిల్, గాలి మరలు, సోలార్ పంపుల కంటే విద్యుత్‌పై ఎక్కువగా ఆధారపడుతున్నారని పేర్కొంది. తాజాగా విడుదల చేసిన 6వ ఎడిషన్ ఎంఐసి నివేదిక ప్రస్తుత ఏడాది గణాంకాలకు సంబంధించినది కాదు. 2017-18లో నీటి పారుదల పరిస్థితులను తాజా నివేదిక ప్రతిబింబిస్తుంది. 2017లో విడుదల చేసిన ఐదో ఎడిషన్ ఎంఐసి నివేదిక 2013-14 పరిస్థితులు ప్రతిబింబిస్తుంది. బ్లాక్ స్థాయి నుంచి సమాచారం సేకరించాల్సి రావడం, సమాచారాన్ని కంపైల్ చేయడానికి, బహిరంగ పరచడానికి వారాలు, నెలలు కాదు, ఏళ్లు పడుతున్నాయి కాబట్టి నివేదికలు ఆలస్యమవుతుంటాయి.

సాగునీటి వనరుల్లో విద్యుత్ వినియోగం 2011లో 56 శాతం ఉండగా, గతవారం విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం 2017 నాటికి ఈ వినియోగం 76 శాతానికి పెరిగింది. భూగర్భ జలాలను వెలికితీయడానికి బోర్‌వెల్స్, ట్యూబ్‌వెల్స్‌ను ఉపయోగిస్తారు. విద్యుత్ వినియోగం పెరుగుదలకు అనుగుణంగానే ట్యూబ్ వెల్స్, బోర్‌వెల్స్ సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. బోర్‌వెల్స్, ట్యూబ్‌వెల్స్ కంటే ఎక్కువ లోతు నుంచి (15 మీటర్ల కంటే ఎక్కువ) నీటిని తోడే డగ్ వెల్స్ సంఖ్య తగ్గింది. 2011లో 87 లక్షలుగా ఉన్న వీటి సంఖ్య, 2017కు 82 లక్షలకు తగ్గింది. 35 మీటర్ల నుంచి కూడా నీటిని వెలికితీసే షలో ట్యూబ్‌వెల్స్ సంఖ్య కూడా 59 లక్షల నుంచి 55 లక్షలకు తగ్గింది.

పెరిగిన బావుల సంఖ్య

అయితే నీటిని తోడుకునే బావుల సంఖ్య పెరిగింది. 70 మీటర్ల లోపు గల బావుల సంఖ్య 31 లక్షల నుంచి 43 లక్షలకు పెరిగింది. 70 మీటర్ల కంటే ఎక్కువ లోతు గల బావుల సంఖ్య 26 లక్షల నుంచి 37 లక్షలకు పెరిగింది. భూగర్భ జలాలను తోడుకోవడం ఎక్కువకావడం ఆందోళన కలిగించే అంశమే అయినా.. ఈ ట్యూబ్‌వెల్‌లు, బోర్‌వెల్‌లు సంఖ్య పెరగడానికి గల కారణాలును ఈ నివేదిక వెల్లడించలేదు. వీటి సంఖ్య పెరగడానికి అనేక కారణాలు ఉంటాయని పేరు చెప్పడానికి నిరాకరించిన ఒక ఆధికారి తెలిపారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే పథకాలు, బావులను కొనుగోలు చేయడానికి రుణాల లభ్యత.. వంటి అంశాలు వీటిపై ప్రభావం చూపుతాయని చెప్పారు. ఈ నివేదిక ప్రకారం దేశంలోని 695 జిల్లాల్లోని 6,47,394 గ్రామాల నుంచి 23.14 మిలియన్ల మైనర్ ఇరిగేషన్ పథకాలు ఉన్నాయి. వీటిలో పథకాల్లో 21.93 మిలియన్లు (94.8 శాతం) భూగర్భ జలాల వెలికితీతకు, 1.21 మిలియన్లు (5.2 శాతం) ఉపరితల-నీటి వెలికితీతకు ఉద్దేశించబడినవి.

దేశంలో అత్యధిక సంఖ్యలో మైనర్ ఇరిగేషన్ పథకాలను కలిగి ఉన్న రాష్ట్రం ఉత్తరప్రదేశ్ (17.2 శాతం). తర్వాత మహారాష్ట్ర (15.4 శాతం), మధ్యప్రదేశ్ (9.9శాతం), తమిళనాడు (9.1శాతం) రాష్ట్రాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 5.1 శాతం పథకాలు అమల్లో ఉన్నాయి. భూగర్భజలాల వెలికితీసే పథకాల్లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు ముందు వరుసలో ఉండగా, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఒడిశా, జార్ఖండ్ ఉపరితల నీటి వెలికితీత పథకాల్లో ముందున్నాయి. ఐదో, ఆరవ ఎడిషన్ల మధ్య ఈ పథకాల సంఖ్య సుమారు 1.42 మిలియన్లు పెరిగింది. ఎక్కువ పథకాలు (96.6%) ప్రైవేట్ యాజమాన్యం లేదా రెండు హెక్టార్ల కంటే తక్కువ భూమిని కలిగి చిన్న సన్నకారు రైతులు నిర్వహిస్తున్నారు.

రక్తమోడిన రహదారులు

వేర్వేరు ప్రమాదాల్లో తొమ్మిది మంది మృతి

ప్రజాశక్తి- సంతమాగులూరు, కదిరి అర్బన్

రాష్ట్రంలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో తొమ్మిది మంది మరణించారు. సొంత పనుల నిమిత్తం పట్టణానికి వచ్చి తిరిగి ఆటోలో వెళ్తుండగా కారు ఢీ కొనడంతో సత్యసాయి జిల్లా కదిరిలో నలుగురు, తమ బంధువుల వివాహ వేడుకల్లో పాల్గొన్ని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆటోను లారీ ఢీకొనడంతో ప్రకాశం జిల్లాలో ఐదుగురు మరణించారు.

తమ బంధువుల వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు గుంటూరుకు చెందిన ఐదుగురు మహిళలు, ఇద్దరు పురుషులు ప్రకాశం జిల్లా మార్కాపురానికి శనివారం రాత్రి వచ్చారు. వేడుకల అనంతరం తిరిగి ఆటోలో గుంటూరుకు పయనమయ్యారు. సంతమాగులూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో గుంటూరు, కర్నూలు రహదారిపైకి వచ్చే సరికి ఆటోను లారీ ఢీకొంది. దీంతో గుంటూరు నల్లచెరువు ఒకటవ లైన్‌కు చెందిన అలివేలు మంగతాయారు (19), తమ్మిశెట్టి తులసి (16), గుంటూరుకు చెందిన పాల్యా నారీనాయక్ (19) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్ర గాయాలపాలైన గుంటూరు హౌసింగ్ బోర్డు ఆదర్శనగర్ మూడవ లైనుకు చెందిన చెలిమెళ్ళ కవిత (19), బుర్రి మాధవి (35)లను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. క్షతగాత్రులను నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రహదారిపై ఏర్పడిన గుంత నేపథ్యంలో పోలీసులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అతివేగంగా వచ్చిన లారీ డ్రైవర్ హెచ్చరిక బోర్డును తప్పించబోయి రాంగ్ రూట్‌లో ఆటో వైపు దూసుకెళ్లాడు. దీంతో ఆటో నుజ్జునుజ్జయ్యింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సత్యసాయి జిల్లా కదిరి మండలం బుక్కపట్నం పరిధిలోని మదిరే బైలుతండా గ్రామానికి చెందిన కొంతమంది సొంతపనుల నిమిత్తం కదిరి వచ్చారు. తిరిగి ఆటోలో వెళ్తున్న క్రమంలో కదిరి మండలం ఎర్రదొడ్డి సమీపాన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నస్వామి నాయక్(45) చలపతి నాయక్ (46) ఆటో డ్రైవర్ భాస్కర్ నాయక్ (40) మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన శ్రీలేఖ (35)ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించారు. క్షతగాత్రులను కదిరి ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. ఘటనాస్థలాన్ని డిఎస్‌పి శ్రీలత, సిఐలు సూర్యనారాయణ, తమ్మిశెట్టి మధు పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సత్యసాయి జిల్లా కదిరిలో నుజ్జునుజ్జయిన కారు

ఇంటర్‌నెట్ నిషేధం ఓ భారీ తప్పిదం

- మెయితీల గుప్పెట్లోనే మీడియా
- ఎడిటర్స్ గిల్డ్ నివేదిక

న్యూఢిల్లీ : మణిపూర్‌లో మైనార్టీ కుకీలపై పెద్దయెత్తున దాడులు, హింస చోటుచేసుకున్న సమయంలో ఇంటర్‌నెట్‌ను రాష్ట్రవ్యాపితంగా నిషేధించడం పెద్ద తప్పిదమని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఇజిఐ) పేర్కొంది. ఇంటర్‌నెట్ నిషేధంతో రాష్ట్రంలో పరిస్థితులు మరింతగా దిగజారాయని తెలిపింది. ఇజిఐకు చెందిన నిజనిర్ధారణ బృందం ఆగస్టు 7 నుంచి 10 వరకూ మణిపూర్‌లో పర్యటించింది. ఈ బృందంలో సీమా గుహ, భరత్ భూషణ్, సంజయ్‌కపూర్ సభ్యులుగా ఉన్నారు. ఈ బృందం ఇటీవల 24 పేజీలతో కూడిన నివేదికను ఆదివారం నాడిక్కడ విడుదల చేసింది. 'మణిపూర్‌లో మెయితీ ప్రభుత్వం, మెయితీ పోలీసులు, మెయితీ అధికారులు ఉన్నారు. కొండల్లో నివసించే ఆదివాసీ ప్రజలకు వీరిపై విశ్వాసం లేదు' అని నివేదిక పేర్కొంది. మణిపూర్ అంటే మెయితీ మీడియా అని పేర్కొంది. ఈ మెయితీ మీడియా భద్రతా బలగాలపై, ముఖ్యంగా అస్సాం రైఫిల్స్‌పై విష ప్రచారాన్ని వ్యాప్తి చేసిందని నివేదిక వెల్లడించింది. 'మణిపూర్‌లో మీడియా తన ప్రజల అభిప్రాయాలుగా చెబుతూ అస్సాం రైఫిల్స్‌కు వ్యతిరేకంగా నిరంతరం ప్రచారం చేస్తూ తన విధి నిర్వహణలో విఫలమైంది. వాస్తవాలను వెల్లడించడంలోనూ వైఫల్యాన్ని మూటగట్టుకుంది' అని స్పష్టం చేసింది. అస్సాం రైఫిల్స్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడానికి తమ పోలీసుల్ని అనుమతించడం ద్వారా మణిపూర్‌లోని బిజెపి ప్రభుత్వం ఈ దుర్మార్గానికి నిశ్శబ్దంగా మద్దతు ఇచ్చిందని నివేదిక పేర్కొంది. ఈ వివాదం, ఇంటర్‌నెట్‌పై నిషేధంతో రాష్ట్రంలో ఒక చోట ఏం జరుగుతుందో.. మరో చోట తెలియకుండా పోయిందని తెలిపింది. దేశంలో పురాతనమైన పారామిలటరీ బలగాలు అస్సాం రైఫిల్స్, మణిపూర్ పోలీసులకు మధ్య వివాదం దేశంలోనే తొలిసారని నివేదిక తెలిపింది. అస్సాం రైఫిల్స్‌కు వ్యతిరేకంగా మణిపూర్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లో 'కుకీ మిలిటెంట్లు పారిపోవడానికి అనుమతించారు' అని స్పష్టంగా ఉంది. ఈ నెల 1న అస్సాం రైఫిల్స్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ పిసి నాయర్ మాట్లాడుతూ మణిపూర్‌లో

మిగతా 2లో

ఎపి చేనేత కార్మిక సంఘం

రాష్ట్ర అధ్యక్షులు కన్నుమూత

- పలువురు నివాళి

ప్రజాశక్తి - అనంతపురం

ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సిపిఎం సీనియర్ నాయకులు పోలా రామాంజనేయులు (71) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు పోలా లక్ష్మీనారాయణ సిపిఎం ధర్మవరం పట్టణ కార్యదర్శిగా పనిచేశారు. కోడలు ఐద్వా నాయకులుగా పనిచేశారు. ఆదివారం ధర్మవరంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ధర్మవరం కౌన్సిలర్‌గా పోలా రామాంజనేయులు రెండుసార్లు గెలుపొందారు.



పోలా రామాంజనేయులు

'ఉన్నత' ఉత్తమ ఉపాధ్యాయుల

జాబితా విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉన్నత విద్యా సంస్థలకు సంబంధించి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికైనవారి జాబితాను రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్‌కు సంబంధించిన జాబితాను సోమవారం విడుదల చేసే అవకాశముంది. రాష్ట్ర ఉపాధ్యాయుల అవార్డు-2023కు విశ్వవిద్యాలయాల నుంచి 40 మంది, డిగ్రీ కళాశాలల నుంచి 21 మంది, ఇంజనీరింగ్, ఫార్మాసి కళాశాలల నుంచి ఐదుగురు చొప్పున ఎంపిక చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది.


ఇందుకు సంబంధించిన జివో 120ను ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి జె శ్యామల రావు ఆదివారం విడుదల చేశారు. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యకు సంబంధించిన పురస్కారాల దస్త్రం ఆదివారం పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి నుంచి విద్యాశాఖ మంత్రి వద్దకు చేరకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వీరి జాబితా సోమవారం విడుదల అవుతుందని అంటున్నారు.

తలకిందులుగా వేలాడదీసి.. మంటపెట్టి...

దళిత యువకుల పట్ల అమానుషం
దోషులను కఠినంగా శిక్షించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మేకను దొంగిలించారనే అనుమానంతో ఇద్దరు దళిత యువకులను తలకిందులుగా వేలాడదీసి... మంట పెట్టి.. కొట్టారు. ఈ అమానుష ఘటన తెలంగాణలోని మంచిర్యాల జిల్లా మందమరి మండలం యాపల్ ప్రాంతంలో చోటుచేసుకుంది. కొమురాజుల రాములుకు చెందిన మేక ఒకటి 20 రోజుల క్రితం కనిపించకుండా పోయింది. తన వద్ద మేకల కాపరిగా ఉన్న గోదావరిఖనికి చెందిన అత్తితాయన్ తేజ (19), అతని స్నేహితుడు చిలుముల కిరణ్ (30) మేక ఎత్తుకెళ్లి ఉంటారని రాములు అనుమానించాడు. శుక్రవారం రాములు, అతని కుటుంబ సభ్యులు కలిసి తేజ, కిరణ్‌లను తమ షెడ్‌లోకి పిలిపించి తలకిందులుగా కట్టేశారు. తలకింద కొమ్మలు పేర్చి తగులబెట్టి కొట్టారు. ఈ దశ్యాలను మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసి ప్రచారం చేశారు. నేరం అంగీకరించిన తర్వాత మేకలను తిరిగి ఇవ్వాలని, లేని పక్షంలో డబ్బులు చెల్లించాలని దళిత యువకులను వారు డిమాండ్ చేశారు. గంటల తరబడి చిత్రహింసలకు గురిచేసిన అనంతరం వార్నింగ్ ఇచ్చి విడిచిపెట్టారు. తీవ్రంగా గాయపడిన తేజ శనివారం ఇంటికి చేరుకుని కొట్టిన విషయాన్ని చెప్పడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. కిరణ్ కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



దుండగులను కఠినంగా శిక్షించాలి : కెవిపిఎస్

మేకను ఎత్తుకెళ్లారనే కారణంతో దళిత యువకులపై అమానుషంగా దౌర్జన్యానికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ, టి స్కైలాబ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇద్దరు యువకులను చెట్టుకు కట్టేసి తలకిందులుగా వేలాడదీసి అమానుషంగా దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు జరిగితే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి కానీ.. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని మధ్యయుగాల నాటి అమానుషాలకు పాల్పడటమేంటని ప్రశ్నించారు. ఒక దళితుడు నా మేకను దొంగలిస్తాడా? అనే కుల దురహంకారంతో బాధితులను తలకిందులుగా చెట్టుకి వేలాడదీసి, కింద అగ్గి మంట పెట్టి చిత్రహింసలకు గురి చేశారని పేర్కొన్నారు. అవమానం భరించలేక కిరణ్ ఎవరికీ చెప్పకుండా పారిపోయాడని తెలిపారు. తక్షణమే మేకల యజమాని సిహెచ్ రాములు పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భారత్ వెలిగిపోతుందట!

2047 నాటికి ఆరోగ్యం, విద్య, సామాజిక రంగాల్లో ప్రపంచంలోనే మిన్నగా..

పిటిఐ ఇంటర్వ్యూలో ప్రధాని మోడీ గొప్పలు

న్యూఢిల్లీ: 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకటిగా ఉంటుందని ప్రధాని నరేంద్ర మోడీ వక్కాణించారు. కులం పేరుతో, మతం పేరుతో మారణహోమం సృష్టించే సంఘ్‌పరివార్ మూకలను వెనకేసుకొచ్చే మోడీ ఆదివారం పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కులం, మతం, అవినీతి రహిత భారత్ గురించి లెక్చరిచ్చారు. 2047 నాటికి ఆరోగ్యం, విద్య, సామాజిక రంగాల ఫలితాలు ప్రపంచంలోనే అత్యుత్తమంగా ఉంటాయని అన్నారు. విద్య, వైద్య రంగాల్లో దేశం ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితి గురించి ఆయన ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు.

భారత దేశంలో అభివృద్ధికి మార్గం చూపిన 'సబ్‌కా సాత్ - సబ్‌కా వికాస్' నినాదం ప్రపంచ సంక్షేమానికి మార్గదర్శక సూత్రం లాంటిదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఒక వారంలో భారత్ జి20 సమ్మిట్‌కు ఆతిథ్యం ఇస్తున్న నేపథ్యంలో ప్రముఖ వార్తా సంస్థ పిటిఐ ప్రధాన సంపాదకులు సహా ముగ్గురు సీనియర్ సిబ్బందికి సుమారు 80 నిమిషాలు పాటు మోడీ ఇంటర్వ్యూ ఇచ్చారు. గత ఏడాది నవంబర్‌లో ఇండోనేషియా నుంచి భారత్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించింది. ఈ డిసెంబర్‌లో బ్రెజిల్‌కు అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలి. ఈ నెల 9, 10 తేదీల్లో జరిగే ముందస్తు వార్షిక సమావేశంలో అమెరికా అధ్యక్షులు జో బైడెన్, జపాన్ ప్రధాని ఫుమియో కిషిదా, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, సౌదీ అరేబియా రాజు మహ్మద్ బిన్ సల్మాన్, ఇతర ప్రపంచ నాయకులు పాల్గొననున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తరువాత సరికొత్త ప్రపంచ క్రమం ఏర్పడినట్లే, కోవిడ్ మహమ్మారి తరువాత మరొక నూతన ప్రపంచ క్రమం రూపుదిద్దుకుంటుందని చెప్పారు. జిడిపి కేంద్రీకృత దృక్పథం నుంచి ప్రస్తుత ప్రపంచం మానవ - కేంద్రీకృత దృక్పథానికి మారుతుందని మోడీ అన్నారు. ఇందులో భారత్ ఉత్ప్రేరకం పాత్రను పోషిస్తుందని అన్నారు. ఈ ఇంటర్వ్యూలో భారతదేశ ఆర్థిక పురోగతి, ప్రపంచ



మిగతా 2లో

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

- రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు
- కొనసాగిన సిపిఎం సమరభేరి

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అధిక ధరలు తగ్గించాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేశారు. ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు చేపట్టారు. విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. సమరభేరీ పేరుతో సిపిఎం చేపట్టిన ప్రచారం ఆదివారమూ కొనసాగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. పలుచోట్ల సంతకాల సేకరణ చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. తణుకు, ఆకివీడులో సంతకాల సేకరణ చేపట్టారు. 'దేశంలో నిరుద్యోగ సమస్య- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి' అనే అంశంపై ఏలూరులో సదస్సు నిర్వహించారు. సమావేశంలో సాబ్జీ మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని కొయ్యలగూడెం, నిడమర్రులో కరపత్రాలు పంచుతూ సంతకాల సేకరణ నిర్వహించారు. అనకాపల్లి రింగ్ రోడ్డు నుంచి నెహ్రూచౌక్ వరకు కాగడాలతో ప్రదర్శన చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. కె.కోటపాడులో నిరుద్యోగ వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు.




అనకాపల్లిలో కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

దేవరాపల్లి, మునగపాక, పరవాడ, రోలుగుంట, చీడికాడల్లో విద్యుత్, అధిక ధరల భారాలపై సంతకాల సేకరణ చేపట్టారు. విశాఖ నగరంలోని సరస్వతి పార్కు నుంచి డాబా గార్డెన్స్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకూ నిరుద్యోగ ర్యాలీ నిర్వహించారు. తిరుపతిలోని ఆర్ట్స్ కళాశాల నుండి ఎన్‌టిఆర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. కాకినాడలో సంతకాల సేకరణ, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని పలు రైతు బజార్ల వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. పార్వతీపురంలో ప్రధాన రహదారిపై విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. విజయనగరం జిల్లా ఎస్.కోటలో కోరుతూ రాస్తారోకో నిర్వహించారు. నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు వద్ద నిరసన చేపట్టారు. బొబ్బిలిలో సదస్సు జరిగింది. కృష్ణా, ఎన్‌టిఆర్, అనంతపురం, శ్రీకాకుళం జిల్లాల్లో ధర్నాలు చేశారు. కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు.

నిరుద్యోగులను మోసగిస్తోన్న ప్రభుత్వాలు

- ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలి
- నిరుద్యోగ భృతి చెల్లించాలి : గఫూర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



సదస్సులో మాట్లాడుతున్న గఫూర్

నిరుద్యోగులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసగిస్తున్నాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 'నిరుద్యోగ సమస్య-కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి' అనే అంశంపై కర్నూలులోని బిర్లా కాంపౌండ్ విజేత స్టడీ సర్కిల్‌లో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ.. యువత పట్ల ప్రభుత్వాలకు సరైన విధానాలు లేకపోవడం వల్ల నిరుద్యోగం భారీగా పెరిగిపోయిందన్నారు. చదువుకున్న, చదువు లేని యువత 33 శాతం ఉపాధి లేక నిరాశలో ఉన్నారని తెలిపారు. కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో 10 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఒక్క రైల్వేలోనే ఆరు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆర్మీలో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా వాటిని భర్తీ చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. బ్యాంకుల విలీనం వల్ల ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రిక్రూట్‌మెంట్ పూర్తిగా సన్నగిల్లిందని తెలిపారు. మానవశక్తిని ఉపయోగించుకోకుండా కృత్రిమ మేధస్సుపైనే ఆధారపడి కార్పొరేట్లకు లాభాలు పెంచి పోషించేలా ప్రభుత్వాల వైఖరి ఉందని మండిపడ్డారు. జగన్ అధికారంలోకి రాకముందు రెండు లక్షల 40 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 80,000 ఉపాధ్యాయ, గ్రూప్స్, ఎస్ఐ, కానిస్టేబుల్, లైబ్రరీ, పశుసంవర్ధకశాఖ తదితర ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. తక్షణమే ఖాళీలన్నింటినీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు భర్తీ చేయాలని, అంతవరకూ నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఇది భిక్ష కాదు హక్కుగా మార్చాలని డిమాండ్ చేశారు. సదస్సుకు సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు నగేష్, రాఘవేంద్ర హుస్సేన్ బాష, విద్యార్థి సంఘం నాయకులు అబ్దుల్లా, సాయి ఉదయ్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

రేపటి నుంచి చంద్రబాబు జిల్లాల పర్యటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మంగళవారం నుంచి జిల్లాల పర్యటన చేపట్టనున్నారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్నారు. అనంతపురం జిల్లా నుంచి ఈ ప్రచార కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇదీ షెడ్యూలు : ఈ నెల 5న చంద్రబాబు హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం 2 గంటలకు బళ్లారి చేరుకుంటారు. అక్కడ తెలుగు ప్రజలు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం రాయదుర్గం నియోజకవర్గం పర్యటనలో పాల్గొంటారు. కళ్యాణదుర్గం, గుంతకల్ నియోజకవర్గాల్లో 6, 7 తేదీల్లో పలు చర్చా కార్యక్రమాలు, సమావేశాలు, రోడ్‌షోలు, సభల్లో పాల్గొంటారు. అలాగే 8, 9 తేదీల్లో కర్నూలు జిల్లాలో పర్యటిస్తారు. 'బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల పాటు టిడిపి నేతలు, కార్యకర్తలు ప్రచార కార్యక్రమం చేపట్టనున్న సంగతి తెలిసిందే.

ఇసుక దోపిడిని ప్రశ్నించినందుకే నాగేంద్ర అరెస్టు : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇసుక అక్రమ తవ్వకాలు, ప్రభుత్వ పెద్దల దోపిడీపై ఎన్‌జిటిలో కేసులు వేసినందుకే ధరణికోటకు చెందిన దండా నాగేంద్రపై ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేసిందని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు తెలిపారు. నాగేంద్ర అరెస్టు ముమ్మాటికీ కక్ష సాధింపే అని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. నాగేంద్ర ఫిర్యాదుతోనే ఇసుక అక్రమ తవ్వకాలపై ఎన్‌జిటి చర్యలు చేపట్టిందని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తు చేశారు. వైసిపి నేతలు ఇసుకలో రూ.40 వేల కోట్లు దోచేసిన విషయం ఆధారాలతో బయటపెట్టామని ఆయన తెలిపారు. దీనికి సమాధానం చెప్పకుండా అరెస్టులకు దిగడం నీతిమాలిన చర్య అని విమర్శించారు. వెంటనే నాగేంద్రను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా ఇసుక అక్రమ తవ్వకాలతో వైసిపి నేతలు కోట్ల సొమ్ము దోచుకున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. దీనిపై ఎన్జిటిని ఆశ్రయించిన నాగేంద్రపై వైసిపి కక్షగట్టి అక్రమ కేసులు బనాయిస్తోందని ఆయన విమర్శించారు.

ఇంధన పన్నులు రాష్ట్రంలోనే అధికం : బిజెపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పెట్రోలు, డీజిల్ తదితర ఇంధనాలపై ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా పన్నులు వేస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోలియంపై రెండుసార్లు పన్నులు తగ్గించిందని చెప్పుకొచ్చారు. అయితే రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం మాత్రం ప్రజలకు ఊరటనిచ్చేలా చర్యలు చేపట్టలేకపోయిందన్నారు. ప్రజలపై అధిక భారాలు మోపినప్పటికీ రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆమె ప్రశ్నించారు. కేంద్రం ఇటీవల గ్యాస్ ధరలను తగ్గించిందని ఆమె పునరుద్ఘాటించారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు తుమ్మళపల్లి హరికృష్ణ

కార్డ్‌ప్రైమ్ 2.0తో అన్నీ కడగండ్లే

- దస్తావేజు లేఖరుల ఆందోళన
- రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద 14న ధర్నాలు
- 15న కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల శాఖలో కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన 'కార్డ్ ప్రైమ్ 2.0' విధానంతో అటు కొనుగోలుదార్లకు, ఇటు అమ్మకం దార్లకు ఇరువురికీ కడగండ్లే మిగులుతున్నాయని దస్తావేజు లేఖరులు పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఇదే వృత్తిని జీవనోపాధిగా చేసుకున్న తమ కుంటుంబాలు కూడా వీధిన పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ దస్తావేజు లేఖరుల వృత్తి పరిరక్షణ సమితి (డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్) రాష్ట్రస్థాయి సమావేశంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. సమితి అధ్యక్షులు తుమ్మళపల్లి హరికృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి 26 జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. కార్డ్‌ప్రైమ్ 2.0ను వ్యతిరేకిస్తూ ఈ నెల 14న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద ధర్నాలు, 15న కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు చేపట్టాలని ప్రాథమికంగా నిర్ణయించారు. కార్డ్ ప్రైమ్ ఇబ్బందులను తెలియజేస్తూ ప్రజా ప్రతినిధులకు మెమోరాండమ్‌లను అందజేయాలని కూడా నిర్ణయించారు. అయితే ఇప్పటికే ఈ అంశంపై హైకోర్టును ఆశ్రయించినందును కోర్టు ఉత్తర్వులను అనుసరించి కార్యాచరణలో మార్పుచేర్పులుంటాయి.

కార్డ్‌ప్రైమ్ 2.0 ప్రకారం దస్తావేజులను రిజిస్టర్ చేయడంతోపాటు కక్షిదారులు దస్తావేజు లేఖరుల ద్వారా తయారు చేయించుకునే దస్తావేజులను కూడా రిజిస్టర్ చేయుటకు ప్రభుత్వం ప్యార్లర్ సర్వీస్‌ను ఏర్పాటు చేయాలని సమావేశంలో డిమాండ్ చేశారు. రిజిస్టర్ చేసిన ఒరిజనల్ దస్తావేజులను కక్షిదారులకు వాపసు ఇవ్వాలని సూచించారు.

ఈ సందర్భంగా హరికృష్ణ, సమితి నాయకులు చింతకాయల నాగసత్యనారాయణ మూరి మాట్లాడుతూ కార్డ్‌ప్రైమ్ 2.0 విధానంపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. దీనివల్ల ఆస్తులు అన్యాక్రాంతమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా దస్తావేజు లేఖనం వృత్తిని జీవనోపాధిగా బతుకెళ్లదీస్తున్న డాక్యుమెంట్ రైటర్ల కుటుంబాలు వీధిన పడే ప్రమాదముందన్నారు.

డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఉద్యమం

- ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియట్ స్ట్రగుల్ కమిటీ వెల్లడించింది. కమిటీ చైర్మన్ పి సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం విజయవాడలోని దాసరి నాగభూషణ్ రావు భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి, కో చైర్మన్ మిరియాల బాలకాశి మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 2022 పిఆర్‌సిలో 8 శాతమే ఫిట్‌మెంట్ ఇచ్చి వెయిటేజ్ ఇంక్రిమెంట్లు తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యం తనకు అనుకూల సంఘాలతో వేతన ఒప్పందం చేసుకుందని విమర్శించారు. ఈ ఒప్పందాలకు ఉద్యోగుల ఆమోదం లేదన్నారు. ఈ ఒప్పందాన్ని పున:సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమకు కూడా పాత పెన్షన్ పథకం అమలు చేయాలని కోరారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న సుమారు 28 వేల మంది కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని ప్రతిపక్ష నాయకుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటికైనా తన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదని తెలిపారు. 2018 వేతన సవరణ వేతనం 2023లో ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. వేతన పెంపుదల ఆలస్యమైనా 16 మాసాలకు ఎటువంటి బకాయిలూ ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. ఈ నెల 10న తాము చేపట్టబోయే ధర్నాకు హైకోర్టు అనుమతి ఇచ్చిందని, ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు పి శివయ్య, సూరిబాబు, గంగయ్య, నాగరాజు రామలింగారెడ్డి, మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

'అమరావతి'లో అక్రమాలపై కేంద్ర సంస్థల దర్యాప్తు

- మాజీ మంత్రి డొక్కా డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నిర్మాణం పేరిటలో నాటి ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ప్రజాధనాన్ని పక్కదారి పట్టించి అనేక అక్రమాలకు పాల్పడ్డారని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ ఆరోపించారు. అమరావతిలో చోటుచేసుకున్న అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ముడుపుల వ్యవహారంపై ఆదాయపన్ను శాఖ (ఐటి) పూర్తి ఆధారాలతో నోటీసులు ఇచ్చిందన్నారు. 2014-19 మధ్య కాలంలో రూ.118 కోట్లు చంద్రబాబుకు విక్కీ జైన్ ద్వారా అందించినట్లు మనోజ్ పార్థసాని అనే అతను వాగ్మూలమిచ్చినట్లు ఐటి నోటీసుల్లో పేర్కొన్నారని డొక్కా తెలిపారు. ముడుపులు అందించిన విక్కీ జైన్, మనోజ్ పార్థసాని ఎవరో తనకు తెలియదని చంద్రబాబు చెప్పగలరా? అని డొక్కా ప్రశ్నించారు. ఐటి నోటీసులపై మాట్లాడకుండా చంద్రబాబు తప్పించుకోలేరన్నారు. అవసరమైతే చంద్రబాబుని, విక్కీ జైన్, మనోజ్ పార్తసానిని కస్టడీలోకి తీసుకుని విచారించాలని కేంద్ర దర్యాప్తు సంస్థలకు డొక్కా విన్నవించారు. అప్పుడే అమరావతిలో రాజధాని పేరిట చోటుచేసుకున్న అక్రమాల అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.



ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక సర్వీస్ రూల్స్

- ఎపి జెఎసి విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉపాధి భద్రత, భవిష్యత్తు కోసం ప్రత్యేక సర్వీస్ రూల్స్ అమల్జేయాలని ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ కె సుమన్, ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్‌బాబు అధ్యక్షతన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బొప్పరాజు మాట్లాడుతూ ప్రత్యేక సర్వీస్ రూల్స్ అమల్జేస్తే జీత భత్యాల పెంపు, మెడికల్ లీవ్‌లు, ఇంక్రిమెంట్ లాంటి అంశాల్లో స్పష్టత ఉంటుందన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 'ఆప్కాస్' ద్వారా ఉపాధి భద్రత కల్పించినా.. శ్రమకు తగిన వేతనం ఇవ్వడం లేదన్నారు. కుటుంబాన్ని కూడా పోషించుకోలేని స్థితిలో చాలా మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కొట్టుమిట్టాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం నాలుగో తరగతి స్థాయి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకైనా సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర కోశాధికారి గిరి కుమార్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎల్‌సి కాలువకు గండి

ప్రజాశక్తి - బొమ్మనహాల్

కర్ణాటకలోని కురుగోడు సమీపంలో 77 కిలోమీటర్ వద్ద హెచ్ఎల్‌సి కాలువకు గండి పడింది. ఇంతకు ముందు పడిన గండిని మూడు రోజులు క్రితం అధికారులు పూడ్చారు. తర్వాత మరో గండి పడింది. ఇప్పుడు మళ్లీ గండిపడడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల, పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆయకట్టు రైతులకు సాగునీరు పూర్తి స్థాయిలో అందే పరిస్థితి కన్పించడం లేదని సాగునీటి సంఘం నాయకులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హెచ్‌ఎల్‌సికి గండి పడిన విషయంపై కనేకల్ డివిజన్ ఆఫీసర్ మద్దిలేటిని సంప్రదించగా ఇది కర్ణాటక పరిధిలోనిదని తమ పరిధి కాదని అన్నారు.



ఆధ్యాత్మిక నగరంగా తిరుపతి

- 'కచ్చపి' ఆడిటోరియం ప్రారంభోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా అభివృద్ధి చేస్తామని టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. తిరుపతి తుడా కార్యాలయం వెనుక స్మార్ట్‌సిటీ నిధులతో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన కచ్చపి ఆడిటోరియంను, సుకృతి కళా నిలయాన్ని ఎంపి మద్దిల గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డిలతో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా 18 మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేసి తిరుపతిని నలుదిక్కులకు అనుసంధానం చేశామన్నారు. ఆధ్యాత్మిక, సాహిత్య, కళలు, మానవీయ విలువలు పెంపొందించేలా అభివృద్ధి చేస్తామన్నారు. సరస్వతీదేవి చేతిలోని వీణ అయిన కచ్చపి పేరుతో ప్రారంభించిన ఈ ఆడిటోరియం అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందని తెలిపారు. కమిషనర్ హరిత మాట్లాడుతూ.. తిరుపతి స్మార్ట్‌సిటీ మిషన్ నిధులు రూ.41 కోట్లతో దాదాపు 612 చదరపు మీటర్ల వైశాల్యంతో కళాక్షేత్రాన్ని, కళానిలయాన్ని నిర్మించామన్నారు. 600 అడుగుల సీటింగ్ కెపాసిటీ ఉందని చెప్పారు. ఆధునిక విద్యుత్ దీపాలు, సౌండ్ సిస్టం ఉందని తెలిపారు.

ఒకే దేశం - ఒకే విద్య కావాలి : కేజ్రీవాల్

భివాని: కేంద్ర ప్రభుత్వం "ఒక దేశం.. ఒకే ఎన్నిక" దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టడంపై ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అంటూ కేంద్రం కొత్త జిమ్మిక్‌తో ముందుకు వచ్చిందని, ఒక ఎన్నికైనా, పది ఎన్నికలైనా, పన్నెండు ఎన్నికలైనా ఒకటేనని అన్నారు. ప్రస్తుతం భారత్‌కు "ఒక దేశం, ఒకే విద్య" అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరికీ సమానస్థాయి విద్య అందాలన్నారు. 'ఒక దేశం..ఒకే ఎన్నిక' అవసరం ఎంతమాత్రం లేదని, ఒక ఎన్నికైనా వెయ్యి ఎన్నికలైనా ఒక్కటేనని ఆయన స్పష్టం చేశారు. హర్యానాలోని భివానీలో ఆదివారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో కేజ్రీవాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయనతో పాటు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా ఈ కార్యక్రమలో పాల్గొన్నారు. దీనికి ముందు ఆదివారం ఉదయం ఒక ట్వీట్‌లో కేజ్రీవాల్ 'ఒకేదేశం-ఒకే ఎన్నిక' హేతుబద్ధతను ప్రశ్నించారు.

మాటల్లేవ్...టిక్ మార్కే..!

- హడావుడిగా ముగిసిన తెలంగాణ పిఇసి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తరపున బరిలో నిలిపే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను కాంగ్రెస్ వినూత్నంగా చేపట్టినా..అది తీవ్ర వివాదాలతో అధిష్టానం చెంతకు చేరింది. కాంగ్రెస్ ఆశావాహుల దరఖాస్తులను పరిశీలించేందుకు ఆదివారం సమావేశమైన ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ (పీఈసీ) హడావుడిగా ముగించింది. దరఖాస్తులను పరిశీలించకుండానే టిక్ మార్క్ చేసి వెళ్లిపోయారు. పర్సన్ టు పర్సన్ చర్చించి మూడు పేర్లు ఖరారు చేస్తారని భావించిన వారికి నిరాశే మిగిలింది. దరఖాస్తు చేసుకున్న వెయ్యి మందికి సంబంధించిన పూర్తి వివరాలను పొందుపరిచిన స్పైరల్ బైడింగ్ సభ్యులకు ఇచ్చినట్టు తెలిసింది. అందులో తెలిసినోళ్ల గురించి టిక్ మార్క్ చేయాలనీ, తెలియకపోతే వదిలేయాలంటూ పిఇసి చైర్మన్ సూచించడంతో సభ్యులు హడావుడిగా టిక్ మార్క్ చేసినట్టు తెలుస్తోంది. దీంతో మాటల్లేకుండానే టిక్‌మార్క్ చేయడంతో తొందరగానే సమావేశం ముగిసింది. మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరి మాత్రం ఇన్ని పేజీలు చదవాలా? అంటూ అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. మొత్తంగా అభ్యర్థుల గురించి చర్చించకుండానే పిఇసి సమావేశాన్ని ముగించడంతో అభ్యర్థి ఎంపిక పారదర్శకంగా ఉండదనే ఆందోళన వ్యక్తమవుతున్నది. దీంతో పిఇసి సభ్యులు ముందుగానే అభ్యర్థుల జాబితా రూపొందించి, తూ...తూ మంత్రంగా సమావేశాన్ని నిర్వహించారనే విమర్శలు వస్తున్నాయి. పిఇసి సభ్యుడు ఏయే పేరుపై టిక్ మార్క్ చేశాడో వారికి గురించి పూర్తిగా సోమవారం జరగనున్న తెలంగాణ రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీ ముందు చెప్పాల్సి ఉంది. అతనికి కచ్చితంగా టికెట్ ఇవ్వాలని చెప్పే హక్కు సభ్యుడికి లేదు...కానీ దరఖాస్తుదారుల్లో ఎవరికి గెలుపు అవకాశాలు ఉన్నాయో చెప్పడానికి స్క్రీనింగ్ కమిటీ అవకాశం కల్పిస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వాటన్నింటిని పూర్తిగా పరిశీలించిన తర్వాత నియోజకవర్గానికి మూడు పేర్ల చొప్పున ఎఐసిసి స్క్రీనింగ్ కమిటీకి పిఇసి పంపనుంది. సమావేశానికి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క గైర్హాజర్ అయ్యారు.



మీడియాతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

అపోహలకు గురి కావొద్దు : రేవంత్

ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పిఇసి) ఎంపిక చేసిన జాబితాను.. సీల్డ్ కవర్‌లో స్క్రీనింగ్ కమిటీకి అందజేస్తామని తెలంగాణ పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చెప్పారు. పిఇసి సమావేశానంతరం తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడారు. మూడు రోజులపాటు స్క్రీనింగ్ కమిటీ హైదరాబాద్‌లోనే ఉంటుందని చెప్పారు. సోమవారం పిఇసి సభ్యులతో వేర్వేరుగా స్క్రీనింగ్ కమిటీ సమావేశమై అభిప్రాయాలు తీసుకుంటుందని చెప్పారు. 'అభ్యర్థుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరుగుతుంది. ఈసారి అభ్యర్థుల్లో బిసి సామాజిక వర్గానికి పెద్దపీట వేయబోతున్నాం. స్థానిక పరిస్థితులు, సామాజిక వర్గాలు ఆధారం చేసుకుని బిసి అభ్యర్థులను ఎంపిక చేస్తాం. అభ్యర్థుల ఎంపికలో ఎవరూ ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదు' అని రేవంత్ వివరించారు. మంగళవారం డీసీసీ అధ్యక్షులు, సీనియర్ నాయకులతో కమిటీ సమావేశమవుతుందని తెలిపారు.

ఆందోళనలో ఆఫ్ఘన్ విద్యార్థులు

- పట్టించుకోని కేంద్రం

న్యూఢిల్లీ : భారత్‌లో ఉన్న ఆఫ్ఘనిస్థాన్ విద్యార్థుల ఆవేదన కేంద్రప్రభుత్వానికి పట్టడం లేదు. దేశంలో 200 మంది యువతులతో సహా సుమారు 700 మంది ఆఫ్ఘన్ విద్యార్థులు ఉన్నారు. వీరిలో కొంతమంది భారత ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌తో తమ చదువు పూర్తి చేశారు. స్వదేశం వెళ్లడానికి ఆఫ్ఘనిస్థాన్ విద్యార్థులు ఇష్టపడటం లేదు. ఒకవేళ స్వదేశం వెళితే ప్రస్తుతం అక్కడ ఉన్న తాలిబన్ ప్రభుత్వం మళ్లీ తమను విదేశాలకు వెళ్లడానికి, ఏ పనీ చేయడానికి అనుమతించదని వారు భయపడుతున్నారు. తాలిబాన్ ప్రభుత్వం వీసా నిబంధనలను కఠినంగా అమలు చేయడమే కాకుండా, అమ్మాయిలకు ఉన్నత విద్యను పూర్తిగా నిషేధించింది. దీంతో స్వదేశం వెళితే తమకు భవిష్యత్ ఉండదని ఆఫ్ఘనిస్తాన్ విద్యార్థినులు భయపడుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం ఏటా సుమారు వెయ్యి మంది ఆఫ్ఘనిస్థాన్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను అందచేస్తూ ఉంటుంది. ఈ విద్యా సంవత్సరానికి స్కాలర్‌షిప్‌లపై ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో చదువు పూర్తికావాల్సిన విద్యార్థులు గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు లేకుండా చదువుకోవడానికి ముందుకు వస్తున్నా కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండా వారిని చేర్చుకోవడానికి యూనివర్శిటీలు వెనకాడుతున్నాయి. చదువు పూర్తయిన వారి వీసా గడువు కూడా పూర్తికావస్తుంది. కేంద్రం వీరి వీసా గడువు కూడా పొడిగించలేదు. దీంతో వీరు తరువాత కోర్సులు పూర్తి చేయడానికి, లేదా ఉద్యోగాలు చేయడానికి అటంకం కలుగుతుంది. తాము పడుతున్న ఇబ్బందులను తెలపడానికి కేంద్ర విదేశాంగ శాఖ అధికారుల్ని అనేకసార్లు విద్యార్థులు కలుసుకున్నారు. అయినా.. కేంద్రం నుంచి ఎలాంటి ప్రతిస్పందనా లేదు.

భారత్ వెలిగిపోతుందట!

(మొదటి పేజీ తరువాయి)

వేదికలపై భారత్ ఎదుగుదల, సైబర్ భద్రత, రుణాల ఉచ్చు, బయో-ఇంధన విధానం, ఐక్యరాజ్యసమితి సంస్కరణలు, వాతావరణ మార్పులు, 2047లో భారత్ ఎలా ఉండబోతుంది.. వంటి అంశాలపై మోడీ మాట్లాడారు.

ప్రపంచ రుణ సంక్షోభం గురించి మోడీ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఇది చాలా ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఆర్థిక క్రమశిక్షణపై రాష్ట్ర ప్రభుత్వాలు స్పృహతో ఉండాలని అన్నారు. ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలకు మోడీ పిలుపునిచ్చారు. 20వ శతాబ్దపు విధానంతో 21వ శతాబ్దంలో ప్రపంచానికి సేవలు అందించలేమని అన్నారు. వాతావరణ మార్పుల గురించి మాట్లాడుతూ వాతావరణ లక్ష్యాలను అందుకోవడంలో భారత్ ఎప్పుడూ అలక్ష్యం వహించలేదని అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా భారత్ తీసుకున్న చర్య ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుపొందిందని మోడీ చెప్పారు. కొన్నేళ్లలోనే సౌరశక్తి సామర్థ్యాన్ని 20 రెట్లు పెంచుకున్నామని తెలిపారు.

ఇంటర్‌నెట్ నిషేధం ఓ భారీ తప్పిదం

(మొదటి పేజీ తరువాయి)

లాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ తమకు ఎదురుకాలేదని చెప్పారు.

ఇంటర్‌నెట్ నిషేధంతో వార్తల క్రాస్-చెకింగ్, మానిటరింగ్‌పై తీవ్ర ప్రభావం చూపిందని నివేదిక తెలిపింది. మే 3న మణిపూర్‌లో ఇంటర్‌నెట్‌పై తొలిసారి నిషేధం విధించారు. ఆ తరువాత దానిని పొడిగిస్తూ వచ్చారు. ఇంటర్‌నెట్ నిషేధంతో జర్నలిస్టులు రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన వార్తలనే అనుసరించాల్సి వచ్చిందని, రాష్ట్రంలో మెజారిటీ ప్రజలైన మెయితీల పక్షం వహించాల్సి వచ్చిందని నివేదిక తెలిపింది. ప్రభుత్వం ద్వారా సమాచారంపై దిగ్బంధనం రాష్ట్రంలో జర్నలిజంపై హానికరమైన ప్రభావం చూపిందని విమర్శించింది. హింసాకాండ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మెయితీ గ్రూపునకు పక్షపాతిగా మారిందని స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని నివేదిక తెలిపింది. ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వంగా తన విధిని నిర్వర్తించడంలో బీరేన్‌సింగ్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించింది.

సాగు అంతంతే..!



నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలో ఎండిపోతున్న మొక్కజొన్న పంట

వర్షాభావంతో ఉమ్మడి కర్నూలులో ఎండిపోతున్న పంటలు

సాధారణం కన్నా 50 శాతం లోటు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సాగు అంతంత మాత్రంగానే ఉంది. కర్నూలు జిల్లాలో మొత్తం సాధారణ సాగు 10,53,900 ఎకరాలు కాగా 7,56,662.5 ఎకరాల్లో రైతులు విత్తనాలు వేశారు. విత్తనాలు విత్తే సమయంలో వర్షాలు పడకపోవడంతో సాగుకు రైతులు అసక్తి చూపలేదు. కర్నూలు జిల్లాలో ప్రధాన పంటగా ఉండే పత్తి సాధారణ సాగు 6,25,067.5 ఎకరాలు కాగా 4,55,577.5 ఎకరాల్లో సాగు చేశారు. వేరుశనగ సాధారణ సాగు 1,66,407.5 ఎకరాలు కాగా 97,447.5, వరి సాధారణ సాగు 32,272.5 ఎకరాలకు కాను16,510, కంది సాధారణ సాగు 59,822.5 ఎకరాలకు 47,925, ఉల్లి సాధారణ సాగు 38,582.5 ఎకరాలు కాగా 25,095 ఎకరాలు మాత్రమే సాగు చేశారు. నంద్యాల జిల్లాలో ప్రధాన పంటగా ఉండే వరి సాధారణ సాగు 1,76,315 ఎకరాలు కాగా కేవలం 45,062.5 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. మొక్కజొన్న సాధారణ సాగు 1,04,745 ఎకరాలకు 86,125, కంది సాధారణ సాగు 93,877.5 ఎకరాలకు 73,680, వేరుశనగ సాధారణ సాగు 39,510 ఎకరాలు కాగా 21,050, పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 63,965 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 23,287.5 ఎకరాల్లో సాగైంది. ఉల్లి సాధారణ సాగు 10,182.5 ఎకరాలు కాగా 4,997.5, మిరప సాధారణ సాగు విస్తీర్ణం 25,010 ఎకరాలు కాగా 13,050 ఎకరాల్లో సాగైంది. గతేడాది తెగుళ్లతో మిర్చి పంట దెబ్బతినడంతో ఈ ఏడాది మిరప పంట సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాభావం ఏర్పడటంతో సాగు చేసిన పంటలు కూడా ఎండిపోతున్నాయి. ఆగస్టు నెలలో కర్నూలు జిల్లాలోని 26 మండలాల్లో 24 మండలాల్లో సాధారణ వర్షపాతంలో 50 శాతం కన్నా తక్కువ వర్షపాతం నమోదైంది. చిప్పగిర మండలంలో సాధారణ వర్షపాతంలో ఒక్క శాతం మాత్రమే పడింది. నంద్యాల జిల్లాలోని 29 మండలాల్లో 26 మండలాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. పాములపాడు మండలంలో 93 శాతం లోటు వర్షపాతం ఏర్పడింది. వర్షాలు లేక నష్టపోతున్నామని, తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



తీవ్రంగా నష్టపోతున్నాను

మూడు ఎకరాలలో పత్తి, వేరుశనగ పంటను సాగు చేశాను. ఎకరాకు రూ.25వేల నుంచి రూ.40వేల వరకు పెట్టుబడి పెట్టాను. వర్షం లేక పంటలు ఎండు ముఖం పట్టి తీవ్రంగా నష్టపోతు న్నాను. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు పంట పొలాలను పరిశీలించి నష్ట పరిహారం చెల్లించాలి.

- లక్ష్మన్న, కుమ్మర వీధి, పత్తికొండ.

పశువులకు మేత కూడా రాదు



నాకు రాంపల్లి గ్రామంలో ఉన్న ఐదు ఎకరాల పొలంలో వేరుశనగ వేశాను. గత నెల అంతా వర్షాలు రాక పోవడంతో పంట అంత ఎండిపోయింది. కనీసం పెట్టబడి కూడా వచ్చేటట్లు లేదు. గత సంవత్సరం అరకొరగా వర్షాలతో కొంతవరకు పెట్టబడి సహాయం వచ్చింది. ప్రస్తుతం ఆ పరిస్థితికనిపించడం లేదు. ఇక రెండు మూడు రోజుల్లో వర్షం పడకపోతే కనీసం పశువులకు మేత కూడా రాదు.

- కందనాతి లక్ష్మీనారాయణ, రాంపల్లి, తుగ్గలి మండలం.

ప్రజా పోరాటంగా 'ఉక్కు' ఉద్యమం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మలచనున్నామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 934వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎఐటియుసి స్టీల్‌ప్లాంట్ విభాగం కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ లాభాల్లో నడుస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను వంద శాతం ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సుదీర్ఘకాలంగా ఆందోళనలు సాగుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన మైత్రితో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తిప్పికొడతామని అన్నారు. ఉక్కు పరిరక్షణ విషయమై కేంద్రంలోని మోడీ సర్కారుపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో ప్రజలే పాలకులకు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



గోవాడ మెయిన్ రోడ్డులో వంట చేస్తూ నిరసన తెలుపుతున్న విద్యార్థులు

వంట సిబ్బందిని నియమించండి

ప్రజాశక్తి - చోడవరం (అనకాపల్లి జిల్లా)

తమ హాస్టల్‌కు తక్షణమే వంట సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లి చోడవరం మండలంలోని గోవాడ గిరిజన బాలుర వసతి గృహం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం చేపట్టారు. వంట తయారు చేసే ఉద్యోగులు లేకపోవడంతో వారం రోజులుగా సొంతంగా వంట చేసుకుని తింటున్న విద్యార్థులు గోవాడ మెయిన్ రోడ్డు సెంటర్‌లో నిరసనకు దిగారు. అక్కడే పొయ్యి వెలిగించి అల్పాహారాన్ని తయారు చేసుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని పెద్ద పెట్టున నినదించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివాజీ మాట్లాడుతూ కొద్దికాలంగా ఈ హాస్టల్ నిర్వహణ బాగోలేదన్నారు. విద్యార్థులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని తెలిపారు. సమస్యలపై ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. త్వరితిగతిన సమస్యను పరిష్కరించ కుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల ఆందోళనకు మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యారావు, సిఐటియు జిల్లా నాయకులు జి వరలక్ష్మి మద్దతు తెలిపి మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ స్పందించి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు.

ప్రేమోన్మాది ఘాతుకం

- యువతి సోదరుడు మృతి.. ఆమెకు గాయాలు
- పోలీసుల అదుపులో నిందితుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో మరో దారుణం చోటుచేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ప్రేమోన్మాది ఘాతుకానికి యువతి సోదరుడు మృతి చెందగా.. యువతి తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన యువతి.. హైదరాబాద్‌లో ప్రయివేటు ఉద్యోగం చేస్తూ ఆమె తమ్ముడు పృథ్వి అలియాస్ చింటూ(25) కలిసి ఎల్‌బినగర్‌లోని ఆర్‌టిసి కాలనీ రోడ్ నెంబర్ 6లో ఉంటున్నారు. రామంతపూర్‌కు చెందిన శివకుమార్‌కు యువతికి 10వ తరగతి నుంచి పరిచయం ఉంది. కొద్ది కాలంగా వారు ప్రేమించుకుంటున్నారు. అయితే నెల రోజుల నుంచి శివకుమార్ ఫోన్ నెంబర్‌ను యువతి బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. దాంతో కోపోద్రిక్తుడైన శివకుమార్.. ఆదివారం మధ్యాహ్నం ఆమె ఇంటికి వచ్చి గొడవకు దిగాడు. దాంతో తన అక్కను శివకుమార్ ఏమైనా చేస్తాడేమోనన్న భయంతో.. ఆమె తమ్ముడు పథ్వి.. కత్తి తీసుకుని శివకుమార్‌ను బెదిరించేందుకు ప్రయత్నించాడు. వెంటనే తేరుకున్న శివకుమార్ అదే కత్తితో పృథ్వి ఛాతీపై పలు మార్లు పొడవగా అతను తీవ్ర గాయాలతో మొదటి అంతస్తు నుంచి కిందకి వచ్చి కొంచెం దూరం నడిచి కిందపడి పోయాడు. వెంటనే అతన్ని ఎల్‌బి నగర్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు. ఇదిలా ఉండగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఈ దాడిలో యువతికీ గాయాలు కావడంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎల్ నగర్ జోన్ డిసిపి సాయి శ్రీ సందర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక కాంట్రాక్టులో నిబంధనలు ఉల్లంఘన

- టిడిపి నేత నక్కా ఆనంద్ బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జయప్రకాష్ పవర్ వెంచర్స్, రాష్ట్రప్రభుత్వానికి మధ్య జరిగిన ఇసుక తవ్వకం కాంట్రాక్టు అగ్రిమెంట్‌లో ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించిందని టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు నక్కా ఆనంద్ బాబు విమర్శించారు. ఒప్పందంలో సబ్ కాంట్రాక్టు ఇవ్వరాదని ఉన్నా.. ఉల్లంఘించి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నీతులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పరిపాలనపై ఏమాత్రం అవగాహన లేదనడానికి రాష్ట్రంలో ఇసుక పాలసీనే నిదర్శనమని పేర్కొన్నారు. ఇసుక కొరత సృష్టించి 103 ఉప వృత్తులను నిర్వీర్యం చేసి 40 లక్షల మందిని రోడ్డుపాలు చేశారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి రాగానే ఇసుక మాఫియా భరతం పడతామని అన్నారు. పెద్దిరెడ్డి తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని, గవర్నర్ వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

అనకాపల్లిని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి)

వర్షాభావ పరిస్థితుల కారణంగా అనకాపల్లి జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఈ నేపథ్యంలో కరువు ప్రాంతంగా ప్రకటించి వారిని ఆదుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. నక్కపల్లి మండలంలోని వేంపాడు, చందనాడ గ్రామాల్లో ఎండిన వరి నారుమడులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా దడాల సుబ్బారావు మాట్లాడుతూ వర్షాలు సరిగ్గా పడకపోవడంతో రైతులు ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో 24 మండలాల్లో తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో 2,04,133 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా, నేటికి కేవలం 84 వేల ఎకరాల్లో మాత్రమే ఉడుపులు అయ్యాయని తెలిపారు. దీనిని బట్టి జిల్లాలో కరువు పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ప్రభుత్వం స్పందించి క్షేత్ర స్థాయికి వ్యవసాయ, రెవెన్యూ అధికారులను పంపించి వర్షాభావం కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని, రైతులకు, వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించి ఆదుకోవాలని కోరారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలు పండించే విధంగా ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలన్నారు. పోలవరం ఎడమ కాలువ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తయితే జిల్లాకు ఇటువంటి పరిస్థితులు దాపురించి ఉండేవి కాదన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు, నాయకులు ఎం.రాజేష్, బి.రాము, ఎం.నానాజీ, ఉప సర్పంచ్ జి.నర్సింగరావు, ఆర్.అప్పారావు పాల్గొన్నారు.



ఎండుతున్న వరి పొలాలను పరిశీలిస్తున్న దడాల సుబ్బారావు తదితరులు

స్లీప్ మోడ్‌లో ల్యాండర్, రోవర్

- 14 రోజులపాటు చీకటి కాలం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ విజయవంతంగా ప్రయోగించి చంద్రునిపై దింపిన చంద్రయాన్-3 ల్యాండర్, రోవర్‌లకు నిర్దేశించిన పనులను విజయవంతముగా పూర్తి చేసింది. జాబిలిపై 14 రోజుల పగటి కాలం పూర్తి కావడంతో అక్కడ చీకటిగా మారి మైనస్ 180 డిగ్రీల చల్లటి వాతావరణం ఆవహించే తరుణం ఆసన్నం కావడంతో, ల్యాండర్‌ను, ప్రజ్ఞాన్ రోవర్ ను స్లీప్ మోడ్‌లోకి పంపి నిలిపివేశారు. శనివారం రాత్రి 10 గంటల 01 నిమిషానికి ల్యాండర్, రోవర్‌ను స్లీప్ మోడ్‌లోకి పంపడం జరిగింది. జాబిల్లిపై 14 రోజుల పాటు చీకటి కాలాన్ని పూర్తి చేసుకున్న తరువాత తిరిగి పగటి కాలం వచ్చే వేళలో అంటే ఈ నెల 22 వ తేదీ ఆపై కానీ తిరిగి ల్యాండర్ రోవర్‌ను ఆన్ చేయాలనీ ఇస్రో నిర్ణయించింది. జాబిల్లిపై మైనస్ 180 చల్లదనం మధ్య 14 రోజుల పాటు ఉండే ల్యాండర్, రోవర్ తిరిగి పగటి కాలం రాగానే సోలార్ ప్యానల్ ఆధారంగా అవి రెండు పనిచేసేలా చేయడం ఇప్పుడు ఇస్రో ముందు ఉన్న మరో కొత్త సవాల్ అని చెప్పాలి. ఈ నెల 22 తరువాత కూడా ల్యాండర్, రోవర్ పని చేయడం మొదలు పెడితే చంద్రయాన్-3 తో ఇస్రో రెండవ విజయం సాధించినట్లు అవుతుంది. చంద్రునిపై దక్షిణ ధ్రువం వైపున రోవర్ 100 మీటర్ల దూరం తిరిగి జరిపిన అధ్యయనంలో విలువైన సమాచారాన్ని ల్యాండర్ ద్వారా భూమికి చేర్చడం జరిగింది. జాబిలిపై సల్ఫేర్, కాల్షియం, ఇనుము, టైటానియం, సిలికాన్, మాంగనీస్ వంటి ఖనిజ సంపద ఉన్నట్లు గుర్తించడం జరిగింది.

రాష్ట్రాన్ని ఎటిఎంలా వాడుకున్న చంద్రబాబు : మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

గత ప్రభుత్వం పలు సంస్థల నుంచి నేరుగా టిడిపి అధినేత చంద్రబాబు, ఆయన అనుచరుల ఖాతాలకు డబ్బులను దారిమళ్లించారని పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆరోపించారు. రాష్ట్రాన్ని ఎటిఎంలా వాడుకున్నారని విమర్శించారు. శ్రీకాకుళంలోని వైసిపి కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు ఆగస్టులో ఐటి శాఖ నోటీసులు ఇస్తే రాష్ట్రంలో ఉన్న మీడియా సంస్థలకు ఎందుకు కనిపించలేదని ప్రశ్నించారు. సుమారు 118 కోట్ల రూపాయలు లెక్కల్లో తేడా వచ్చాయని ఐటి శాఖ నోటీసుల్లో పేర్కొందని గుర్తు చేశారు. అమరావతి పేరుతో చంద్రబాబు ఏ స్థాయిలో అక్రమాలకు పాల్పడ్డారో దీన్నిబట్టి అర్థంచేసుకోవచ్చని తెలిపారు. చంద్రబాబు సంపద సృష్టిస్తానని చెప్పడం వెనుక రహస్యాలు ఇంకా ఉన్నాయన్నారు. తాత్కాలిక సెక్రటేరియట్ కట్టడం ద్వారా కమీషన్లు కొట్టేశారని విమర్శించారు. వినయ్, విక్కి అనే వ్యక్తుల ద్వారా బోగస్ కంపెనీలు రిజిష్టర్ చేసి వాటికి సబ్ కాంట్రాక్టులు కట్టబెట్టి లావాదేవీలు జరిపారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును ఎటిఎంలా వాడుకున్నారని సాక్షాత్తూ ప్రధాని చెప్పారని గుర్తు చేశారు. పోలవరం ఒరిజినల్ బిడ్డర్‌ని పక్కన పెట్టి రామోజీరావు వియ్యంకుడుకు చెందిన నవయుగ సంస్థకు కట్టబెట్టారని ఆరోపించారు. ఎన్‌టిఆర్ స్మారక నాణెం ఆవిష్కరణ పేరుతో ఢిల్లీ వెళ్లి ప్రధాని మోడీ, అమిత్ షా కాళ్లు పట్టుకొన్నారని మంత్రి ఎద్దేవా చేశారు. చంద్రబాబు అక్రమాలపై ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్ ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు.



నివాళులర్పిస్తున్న రాంభూపాల్, ఓబులు

చేనేత సమస్యలపై అలుపెరగని పోరాటం

- పోలా రామాంజనేయులకు పలువురు నివాళి

ప్రజాశక్తి - అనంతపురం

చేనేత కార్మికులు, చేనేత సమస్యలపై ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సిపిఎం సీనియర్ నాయకులు పోలా రామాంజనేయులు అలుపెరగని పోరాటం సాగించారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత సమస్యలపై ఆయన నిరంతర పోరాటం సాగించారు. చేనేత కార్మికులకు ఎక్కడ సమస్య ఉందని తెలిసిన వెంటనే అక్కడికి వెళ్లి వారి సమస్య పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించారు. ధర్మవరం అనగానే గుర్తుకొచ్చే నేతగా పోలా రామాంజనేయులు తన పేరును సంపాదించుకున్నారు. ఆయన మృతి పట్ల అన్ని రాజకీయ పార్టీ నాయకులు తమ సంతాపాన్ని తెలియజేశారు.

చేనేత కార్మిక సంఘం ,సిపిఎం సంతాపం

పోలా రామాంజనేయులు మృతికి ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పిల్లల మర్రి బాలకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రగాఢ సంతాపం తెలిపారు. చేనేత కార్మికుల పక్షాన అనేక పోరాటాలు చేశారని గుర్తు చేసుకున్నారు. పవర్ లూమ్స్‌కు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు చేశారని తెలిపారు. భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు, సత్యసాయి జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, అనంతపురం జిల్లా నాయకులు బాలరంగయ్య, రామిరెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, ఎపి చేతివృత్తిదారుల సమన్వయ కమిటి కన్వీనర్ భాస్కరయ్య, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఓ నల్లప్ప, అంద్ర మాల్యాద్రి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ తదితరులు సంతాపాన్ని ప్రకటించారు.

24 గంటలు కరెంటు

- జిఒ 79 రద్దు చేసి పోలీసుల అలవెన్స్ పునరుద్ధరిస్తాం : లోకేష్

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)



తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ కోతలు లేకుండా 24 గంటలు విద్యుత్ అందిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర 203వ రోజుకు చేరింది. ఆదివారం ఏలూరు జిల్లా నిడమర్రు మండలం చిననింద్ర్రకొలను నుంచి ప్రారంభమైన పాదయాత్ర పెద్దనింద్రకొలను, నిడమర్రు, మందలపర్రు, భువనపల్లి మీదుగా పశ్చిమగోదావరి జిల్లాలోని కోలమూరు వరకు సాగింది. గణపవరంలోని శేషమహల్ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ.. విద్యుత్ ఛార్జీలతోపాటు విద్యుత్ కోతలు పెంచిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తాము అధికారం చేపట్టిన వెంటనే నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. ప్రతి నెల ఒకటో తేదీన ఉద్యోగులకు జీతభత్యాలు అందించి అందరికీ ఆమోదయోగ్యమైన ఫిట్‌మెంట్ అందిస్తామని, జిఒ 79ని రద్దు చేసి పోలీసుల అలవెన్స్ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు బంధువు షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే తన సొంతూరులో రోడ్డు వేసుకోలేని అసమర్థుడని, తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

మందలపర్రులో ఉద్రిక్తత

ఏలూరు జిల్లా నిడమర్రు మండలం మందలపర్రులో పాదయాత్ర సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. పాదయాత్ర వెళ్లే మార్గంలో అడ్డుగా వైసిపి శ్రేణులు కొందరు ద్విచక్ర వాహనాలను అడ్డుపెట్టి, జెండాలు చూపుతూ కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో వైసిపి, టిడిపి శ్రేణుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువురు పరస్పరం దాడికి దిగి రాళ్లు రువ్వుకున్నారు. సుమారు 15 నిమిషాలపాటు మందలపర్రు రణరంగంగా మారింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరుపక్షాలను సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాలేదు. దీంతో పోలీసు బలగాలు పెద్దసంఖ్యలో చేరుకుని ఇరుపక్షాలను చెదరగొట్టారు. ప్రస్తుతం మందలపర్రు పోలీసు పహారాలో ఉంది. ఈ ఘర్షణలో ఇరుపక్షాలకు చెందిన కొంతమందికి గాయాలయ్యాయి. ఈ క్రమంలో తెలుగు యువత ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి చందు కారును వైసిపి శ్రేణులు ధ్వంసం చేశాయి.

జనం మధ్యకు...చిరుతలెందుకు..?

భయాందోళనలో 'శ్రీవారి' యాత్రికులు



ఇటీవల పట్టుబడిన నాలుగో చిరుత

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమలలో చిరుతల సంచారం భయాందోళన కలిగిస్తోంది.. బాలుడిపై దాడికి పాల్పడటం, మరో బాలికను పొట్టన పెట్టుకోవడంతో నడకదారిలో 'అలజడి' మొదలయ్యింది. టిటిడి యంత్రాంగంలోనూ కలవరం మొదలయ్యింది. ఈ నేపథ్యంలో 'జనం మధ్యకు చిరుతలు ఎందుకు వస్తున్నాయి' అని పరిశీలిస్తే మానవ తప్పిదమని ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. స్మగ్లర్ల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న ఉదాసీనతే ఇందుకు ప్రధాన కారణమని చెప్పుకోవచ్చు. ఆ తరువాత టిటిడి నిర్లక్ష్యంపైనా పెద్దఎత్తున విమర్శలు లేకపోలేదు. శేషాచలం అడవుల్లో నాలుగున్నర లక్షల ఎకరాల్లో ఎర్రచందనం విస్తారంగా ఉంది. విదేశాల్లో మంచి ధర ఉండడంతో స్మగ్లింగ్ వేళ్లూనుకుపోయింది. రోజుకు టన్నులకొద్దీ ఎర్రబంగారం సరిహద్దులు దాటుతోంది.. ఇది వన్యప్రాణుల పాలిట శాపమయ్యింది.

జనం మధ్యకే ఎందుకు పులులు?

తిరుమలలో చిరుతలు యథేచ్ఛగా తిరుగుతున్నాయంటే మూడు బలమైన కారణాలు ఉన్నాయి. చిరుత పులులు నివాసం ఏర్పరచుకున్న శేషాచలం పెద్దబండ వద్ద ఇటీవల ఎర్రచందనం అక్రమ రవాణాకు తెరదీశారు. అక్కడ మంచి దుంగ చెట్లు ఉండడంతో స్మగ్లర్లు చిరుతలపై బాణం ఎక్కుపెట్టారు. బాణసంచా పేలుళ్లు, యంత్రాలతో శబ్దాలు, వంట వండుకునేందుకు అగ్గి పెట్టడం తదితర కారణాల వల్ల చిరుతలు ఆ ప్రాంతం నుంచి పారిపోయి జనం మధ్యకు వస్తున్నాయని ఓ అధికారి స్పష్టంగా చెప్పారు. స్మగ్లింగ్ అరికట్టేందుకు ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్మగ్లర్లు ఉన్న చోటుకు పోవాలంటే ఒకరోజు సమయం పడుతుంది. ఈ కారణంగానే తూతూమంత్రంగా నిఘా ఉంచారని తెలుస్తోంది. పులులు నివాసం ఉన్న 'పెద్దబండ' నుంచి తిరుమల శివారు ప్రాంతాల్లో జనసంచారం ఉండే వైపు వచ్చేస్తున్నాయి. ఇక రెండో కారణం పరిశీలిస్తే ఆగస్టు, సెప్టెంబర్ మాసంలో చిరుతలు సంతానోత్పత్తి కోసం ఆడపులుల కోసం మగ చిరుతలు వెతుక్కుంటూ వస్తుంటాయి. ఇప్పుడు పట్టుబడిన నాలుగు చిరుతల్లో ఒకే ఒక్క ఆడ చిరుత ఉంది. మిగిలిన మూడు మగ చిరుతలు. టిటిడి యాత్రికుల ఆహ్లాదం కోసం జింకల పార్కును అలిపిరి నడకమార్గం అంచున ఏర్పాటు చేశారు. పులులు జింకల కోసం వస్తూ మూడేళ్ల క్రితం ఏడు జింకలను చంపేశాయి. అప్పట్లో కేంద్ర వన్యప్రాణి విభాగం అధికారుల సూచన మేరకు జింకల పార్కు ఇక్కడి నుంచి తీసేయాలని టిటిడికి ఆదేశించింది. కరోనా సమయంలో టిటిడి ఆ జింకల పార్కును తొలగించింది. గత 15 ఏళ్లుగా జింకలకు ఆహార పదార్థాలను యాత్రికులు ఇస్తూ వచ్చారు. ప్రస్తుతం ఈ జింకలను అడవిలోకి వదిలేసినా, స్వతహాగా ఆహారం సమకూర్చుకోకుండా నడకదారిలో యాత్రికులు అందించే ఆహార పదార్థాలకు అలవాటు పడి ఆ ప్రాంతాల్లోనే సంచరించడం వల్ల పులులు వస్తున్నాయన్నది ఓ విశ్లేషణ. నడక దారిలోని ఆంజనేయస్వామి గుడి దగ్గర నుంచి నరసింహస్వామి గుడి వరకూ ఇప్పటికీ జింకలు రోడ్డు పక్కన యథేచ్ఛగా యాత్రికులకు కనిపిస్తూ ఉంటాయి. ఈ కారణాలన్నింటి రీత్యా పులులు జనావాసాల్లోకి వస్తున్నాయని ఫారెస్టు అధికారులు చెబుతున్నారు.

శేషాచలంలో పెద్దపులి సంచారం..?

ఇప్పటివరకూ శేషాచలం అడవుల్లో చిరుతలు, ఎలుగుబంట్లు తప్ప పెద్ద పులులు లేవు. అయితే కుమారధార - పసుపుధార ప్రాజెక్టుల వద్ద ఓ పెద్దపులి సంచారం చేస్తున్నట్లు 'నక్కలోళ్లు' టిటిడి అధికారుల దృష్టికి తెచ్చారు. దాని అడుగులను సైతం టిటిడి అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. నల్లమల అడవుల నుంచి ఈ పెద్ద పులి వచ్చి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

బిజెపికి డౌన్‌ఫాల్ షురూ..అందుకే జమిలీ !

- సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశ వ్యాప్తంగా బిజెపి డౌన్ ఫాల్‌మొదలైందని, మళ్లీ బతికేందుకే ఆ పార్టీ అడ్డదారులు తొక్కుతోంది."ఇండియా కూటమి"కి రోజురోజుకు పెరుగుతున్న ఆదరణతో బిజెపికి గుబులు పట్టుకున్నదని, అందుకే ఆ పార్టీ ముందస్తుగా జమిలి ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమవుతోందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. ఆ పార్టీ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నర్సింహతో కలిసి ఆదివారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో నారాయణ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంబయిలో నిర్వహించిన 'ఇండియా కూటమి' సమావేశం ప్రభావంతోనే ప్రధాని మోడీ 'ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని ' ఏర్పాటు చేశారన్నారు. మూడో ఫ్రంట్ పేరుతో బిఆర్ఎస్, జాతీయ స్థాయిలో ఎంఐఎం మరోసారి బిజెపిని గెలిపించేందుకు కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేస్తారనే ఉద్దేశంతోనే బిజెపికి కెసిఆర్ అనుకూలంగా మారారని చెప్పారు.



" అక్షరం చిగురిస్తే శబ్దమౌతుంది.
తీగ సాగితే వాక్యమౌతుంది.
పందిరంత విస్తరిస్తే గ్రంథమౌతుంది.
సమస్త వాఙ్మయ సృష్టికి
బీజరూపం అక్షరమే!"

- డా. సి.నారాయణరెడ్డి




కలలు కనే సమయం

నడుస్తుంటే
నీడ వెంటాడుతున్న భయం
వెన్నుపూసల నిండా
తేళ్ల జెర్రులూ పాముల పరుగు
ఏ అడుగు దగ్గరైనా సరే
గుండె పేలిపోవచ్చు...
శరీరం కణ విచ్ఛిన్నం కావొచ్చు..
తొడ తొక్కినందుకో
తోక తొక్కినందుకో
అకారణంగానే కత్తి కాటేయొచ్చు
నడుస్తూ నడుస్తూనే కాళ్లు
తొడలు దాకా విరిగిపోవొచ్చు...
ఎప్పుడెక్కడెందుకేం జరుగుతుందో
ఎవడికీ ఎప్పటికీ అర్థం కాదు

ఎదుట చిర్నవ్వు అర్థం కాని రాక్షసి మాయ
విస్ఫోటించడానికి సిద్ధమైన చేమంతి
గొంతుపైన కాలం కత్తి
గడియారం పెండ్యూలమ్‌లా
రాత్రింబవళ్లు పహారా కాస్తుంది
ఇంట్లో, ఆఫీసులో, రోడ్డుమీద
ఆకాశం కిందా, భూమి పైనా
ఎక్కడా సేఫ్టీరేంజ్ వుండదు
సెల్ఫోన్ మోగినా
ప్రాణం ఎండుటాకులా వొణుకుతుంది
చీకటి - శత్రువు విసిరిన
స్పర్శ లేని వలలా పర్చుకున్నప్పుడు
భయం శ్వాసగా మారిపోతుంది...
మృత్యులోయ కత్తుల వంతెన పైన
కాలి నడకైపోయింది జీవితం
కలలు కనే సమయం లేదు!

- ఈతకోట సుబ్బారావు
94405 29785



ఇంకేం కావాలి?

సమస్యల రాతి గోడల కింద పడి
మనుషులు విలవిల్లాడుతుంటారు
దేన్నైనా ఎంతటి బరువునైనా
ఎవడి భుజం మీద వాడు మోయాల్సిందే!
ఎవడి చేతులు వాడికి ఊతమవ్వాల్సిందే
నీ చెలిమో నీ రక్త సంబంధమో
కాసేపు ఓదార్పుల వింజామరలు విసిరి సేద దీర్చవచ్చు
లేదూ -
హృదయమున్న మనసు అంత ఆసరాగా
కొంత బాసటగా నిలబడవచ్చు
నీ అవసరం ఈ లోకానికి
ఇంకా ఉందని రక్షించుకోవచ్చు

అయినా నీ యాతన నీదే
వెన్నెల లోకానికి నీ ప్రయాణం నీదే
నీ బతుకు యుద్ధం నీదే
బతికున్నంతవరకు మనిషికి
సంఘర్షణ తప్పదు!

రేపటిరోజున నీ కళ్లు నీ కాళ్లు నీ సమస్త శక్తుల్తో
నీ గమనం ముందుకు సాగిపోవాల్సిందే
నీ చెమటతో నీ చాకిరితో
నీ ఊపిరి నువ్వు పోసుకోవాల్సిందే
నువ్వు నువ్వై జీవించాల్సిందే!

మనిషిప్పుడు సమూహంలో ఒంటరివాడు
వేవేల ప్రాణుల నడుమ ఏకాకి
సాలె పురుగు గూట్లో
పడి తన్నుకుంటున్న చిన్ని కీటకం -
ఇక్కడ నేలంతా సంపద చుట్టూనే
పరిభ్రమణమౌతుంది కదా
తెలుసో తెలియకో నీ చేతిలో
ఇనుప గొడ్డలి జారిపోతే
స్వర్ణ కుటారం తెచ్చి ఇచ్చే ఏ వన దేవత లేని స్థలమిది
నీ నీతినీ నిజాన్నీ సత్య వ్రతాన్నీ
ప్రశంసించే కాలం కాదిప్పుడు
పెనుగాలికి కూలిన వృక్షం
మట్టిలోని వేర్ల బిగువుతో
నాలుగు చినుకుల సాయంతో
తనకై తాను పైకి లేచినట్లు
నిటారుగా నిలబడి చిగురించాలి
లేచిపోయిన పిట్టల్ని మళ్లీ పిలిచి
చిటారి కొమ్మల తలలపై కూర్చోబెట్టుకోవాలి
ఎండిపోయిన వాగులోకి
ఏదో ఒక సమయాన వరద నీళ్లు రావాలి

సమస్యల ముళ్ల దారిలో
మనుషులు నడుస్తూ కన్నీరౌతుంటారు
రోగాల్తో, మూగ వేదనల్తో సతమతమౌతుంటారు
ఊబిలో పడ్డ మృగంలా బేలగా చూస్తుంటారు
మనిషి పుట్టుక సమస్య
మనిషిగా బతకడం,
బతకాలనుకోవడం సమస్య
మనిషికి స్వేచ్ఛనీ శ్రమనీ ప్రేమనీ
ఇవ్వడం, తీసుకోవడం
అందరికీ పంచి పెట్టడం సమస్య!

సమస్యల్ని జయించిన వాడే దృఢచిత్తుడు
సమస్యల్ని ఎడం కాలితో తన్ని
స్థిరంగా ఉండగల్గిన వాడే వీరుడు
సమస్యల చిక్కు దారాల్ని
వీలైనంత ఓర్పుగా, ఓపిగ్గా, అలవోకగా
విడదీయగలిగివాడే అసలైన శాంతమూర్తి
నోరుంది, మాటుంది,
రచ్చబండ మీద రమణీయమైన
వాక్య సముదాయం ఉంది
మనిషీ! పోదాం పద
మనిషికి ఇంకేం కావాలి
మనిషికి ఇంకేం లభించాలి!

- రవి నన్నపనేని
9182181390

విభిన్న విమర్శకుడు మేడిపల్లి

సందర్భం

విమర్శకుడిగా ఆచార్య మేడిపల్లి రవికుమార్ గారిది మైక్రోస్కోపిక్ దృష్టి. వేదిక ఎక్కాక ఆయన ఉపన్యాసం గాలి వీచినంత సహజంగా అలలా సాగిపోతుంది. చేతిలో ఏ కాగితం లేకుండా మాట్లాడగలగడం, కోట్ చేసే కవితల్ని తడుము కోకుండా చెప్పడం, ఏ ప్రక్రియలోనైనా విశ్లేషణ చేయగల శక్తి ... ఆయన ప్రత్యేకత. పరిశోధనా పర్యవేక్షణలో ఆయన చూపు మరీ స్పష్టం. కొన్నిసార్లు కష్టం అనిపించినా, ఆయనేమి మోహమాటానికి పోడు. ఆయన పర్యవేక్షణలో ఉన్న పరిశోధకుడిని సైతం వైవా సమయంలో ఆయన ప్రశ్నలు వేసేవారు. అదిగో, అంత పుటం పెట్టేవారు. ఆయన పర్యవేక్షణలో జరిగిన పరిశోధనలు భీముని భాగం గొప్పవి. సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర నిర్మాణంలో ఆరుద్రతో కలిసి పని చేసిన అనుభవం వారిది.

కేవలం కాలక్షేపం కోసమో, సామాజిక హోదా కోసమో, బిరుదులు, అవార్డులు పొందడం కోసమో కలం పట్టుకునేవాడు ఆధునిక కవి కాడు అనేది రవికుమార్ అభిప్రాయం. సమాజం పట్ల బాధ్యత, విధానాల పట్ల ఒక స్పష్టత కలిగి ఉండడం ఆధునిక కవి ప్రధాన లక్షణం అని ఆయన భావిస్తారు. ఆధునిక, ప్రాచీన కవిత్వాన్ని చాలా ప్రత్యేకమైన చూపుతో అంచనా వేయగలరు. అనేక తూకాలు లోలోపల ఆయనే వేసుకుని ఒక నిర్ధారణ చేస్తారు.

వస్తు వైవిధ్యం లోతుగాను, శిల్ప వైశిష్ట్యం ఎత్తుగాను ఉండాలని ఆయన ఆశిస్తారు. అంతర్మథనంలో ఒక వస్తువు నలుగుతున్నంతవరకు, అది రూపం సంతరించుకునేంతవరకు స్వీకరించింది, ఏదైనా అది కవి సొంతం. అది ఒక ఆకృతిని పొందాక, కావ్యలోకంలోకి కాలు మోపాక దానిని తర్వాత పాఠకుడు పర్యావలోకిస్తాడు అని గట్టిగా నమ్ముతారు. పూటకో మాట మాట్లాడే, సామాజిక బాధ్యత వహించని కవులను నిర్లక్ష్యం చేయమంటారు. సామాజిక ప్రయోజనాన్ని ఆశించి కలం పట్టిన కవుల్లో వైవిధ్యం ఉండొచ్చు గానీ అంతర్ వైరుధ్యాలు ఉండకూడదు అని అంటారు.

అనేక సభల్లోనూ సమావేశాల్లోనూ మానవ సంబంధాల పతనం, సాంస్కృతిక విధ్వంసం, ఆటపాటలను హైజాక్ చేసిన వస్తు సంస్కృతులు, సామ్రాజ్యవాదం, పరాయికరణ గురించి రవికుమార్ మాట్లాడారు. ఆ కాలంలో వెలువడ్డ కథల్ని, కవితల్ని, నవలల్ని విశ్లేషిస్తూ ఆయన చేసిన ప్రసంగాలు అద్భుతమైనవి. ప్రపంచీకరణ నేపథ్యంలో 'పొగ చూరిన ఆకాశం - అద్దేపల్లి విజన్' అనే 23 పేజీల వ్యాసంలో చాలా కీలకమైన విషయాలు ఆయన చర్చించారు.

"మనుషుల కంటే, మానవీయ విలువల కంటే వస్తువులకు, సరుకులకు ప్రాధాన్యం ఇవ్వడం, ఎక్కువగా వాటి మీదనే



వ్యామోహం పెంచుకోవడం, మధ్య తరగతి జీవితాల్లో కూడా ఈనాడు ప్రవేశించింది. ఎవరైనా అతిథులు తమ ఇళ్లకు వచ్చినప్పుడు కుటుంబ సభ్యులను కాక ఇంట్లోని టీవీలను, ఫ్రీజ్‌లను, సోఫాలను, డైనింగ్ టేబుళ్లను పరిచయం చేయడం జరుగుతోంది. వస్తు వ్యామోహ సంస్కృతి అంటే ఇదే అని.." రవికుమార్ చాలా సులభంగా ప్రపంచీకరణ పర్యవసనాలను తెలియజేస్తారు.

"మన ఎన్నుకున్న నాయకులు మన ప్రజాస్వామ్య దేశాన్ని పరిపాలిస్తున్నారని మనం అనుకుంటాం. కానీ వీళ్లంతా సామ్రాజ్యవాదం గుప్పెట్లో పెట్టుకున్న కీలుబొమ్మలు మాత్రమే! మనం కేవలం ప్రేక్షకులం. ఈ విషయం తెలియకుండా ఉంచడమే ప్రపంచీకరణ ప్రధాన లక్షణం. ప్రజల్ని కుహనా సంస్కరణ భ్రమల్లో ముంచి దేశాన్ని అతలాకుతలం చేస్తున్న ఈ ప్రపంచీకరణ విధానాల అసలు రంగు సామాన్య ప్రజలకు తెలియకపోవచ్చు. లాభాలను కూడపెట్టుకునే వారికి తెలిసినా తెలియనట్లు నటించొచ్చు. కానీ, మేధావులైన కవులు, కళాకారులు, రచయితలు ఈ పరిణామాలన్నిటినీ గమనిస్తూ దేశ ప్రజలను జాగృతం చేయాలి." అని రవికుమార్ అనేక సభల్లో పిలుపునిచ్చారు.

'ఈనాటి సినిమా పాట స్వభావాలు -ప్రభావాలు' (ప్రజాసాహితి- జూన్-2006) అనే వ్యాసంలో సినిమా కళ కూడా పాలకవర్గాలకు, పెట్టుబడిదారీ వర్గాలకు అనుకూలంగానూ, ప్రజా వ్యతిరేక కళారూపంగానూ మారడం ప్రపంచీకరణలో భాగమే అని వివరించారు. ప్రపంచీకరణ ప్రభావం సినిమా రంగంపై ఎలా పడిందో సోదాహరణంగా వివరించారు. సర్దార్ పాపారాయుడు సినిమాలోని '1980 వరకు ఇట్లాంటి ఒక పిల్ల నా కంట పడలేదు' అనే పాట, 2002లో జూనియర్ ఎన్టీఆర్ 'రెండు వేల రెండు వరకు చూడలేదే ఇంత సరుకు' అని మారింది. అక్కడి పిల్ల ఇక్కడ సరుకు కావడమే ప్రపంచీకరణ' అని నివ్వెరపోయే స్టేట్మెంట్ ఇస్తారు రవికుమార్. 'జగదేకవీరుడు అతిలోక సుందరి' సినిమాలోని అబ్బనీ తీయని దెబ్బ అనే పాటలో పురుషాధిక్యపు భావజాలం ఎలా ఉందో చూపుతారు. నరసింహ నాయుడు సినిమాలోని 'లక్స్ పాపా లక్స పాపా లంచ్ కొస్తావా' అనే పాటలో 'నీ సోకులన్నీ లీజు కిస్తావా' అని అడగడం.. లీజ్ అనేది వ్యాపార సంస్కృతికి చెందిన మాటని వివరిస్తారు. వ్యాపార సంబంధాలు పెనవేసుకొని పోవడం ప్రపంచీకరణ భావజాలంలోని పరాకాష్ట దశగా చూడాలని ఆయన చెప్పారు.

సాహితీ స్రవంతి ప్రచురించిన 'గమనం' సాహిత్య ప్రత్యేక సంచికలో ఆయన 'తెలుగు కవిత్వంలో మిథోపోయి' అనే వ్యాసంలో చాలా సమగ్రమైన విశ్లేషణ చేశారు. మైథాలజీ గాథలకి, మిథోపోయికి ఉండే భేదాన్ని స్పష్టంగా చెప్పారు. తెలుగు కవిత్వ ఉద్యమాల్లో మిథో పోయి పద్ధతి ఎలా ఉందో ఉదాహరణలు చూపారు. అంబేద్కర్ దళిత తాత్వికతను గురించి ఆయన అనేక సందర్భాల్లో మంచి వ్యాఖ్యానాలు చేశారు. "కులరహిత సమాజం గురించి అంబేద్కర్ చేసిన హితబోధ దళిత వర్గాల్లో మాత్రం కొంత చైతన్యం కలిగించింది. ఇతరులు అంబేద్కరుని ఇంకా అందుకోలేదు. విద్యావంతుల కొందరు గుర్తించినా అంబేద్కర్‌ను దళితోద్ధారకుడిగానే పరిగణిస్తున్నారు. ఏ సంస్కృతి దళిత జాతిని వివక్షకు గురి చేస్తూ ఉందో ఆ సంస్కృతిలో ఉన్నంతకాలం దళిత జాతి వివక్ష నుంచి విముక్తి కాలేదన్నది అంబేద్కర్ ఆలోచన. అందుకే ఒక ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించుకోవాలని అంబేద్కర్ సూచన. ఈ తాత్విక అంశాన్ని దళిత కవిత్వం రాసే కవులు గుర్తించాలని రవికుమార్ అంటారు.

కొన్ని కథలు, నవలలకు తాను రాసిన ముందుమాటల్లో కథ, నవల నిర్మాణం గురించి రవికుమార్ కొన్ని మంచి ప్రతిపాదనలు చేశారు. విఆర్ రాసాని 'చీకటి ముడులు' నవలకు ముందుమాట రాస్తూ- "శాస్త్రీయత వాస్తవికత వంటి అంశాలు ఏ రచనకైనా దాని ఆయువు పట్టుకు ప్రమాణాలు. నవల, కథానిక వంటి కల్పనా సాహిత్యంలో శాస్త్రీయత కోసం అన్వేషించడం అత్యాశ అవుతుంది. అయితే వాస్తవికత అనేది మాత్రం ఈ ప్రక్రియలకు ప్రాణవాయువు వంటిద'ని అన్నారు. వడ్డెర చండీదాస్ నవల అనుక్షణికం గురించి ప్రజాసాహితి మే 2005లో రాసిన వ్యాసంలో - చండీదాస్ నిజమైన అస్తిత్వవాద రచయిత ఎందుకు కాలేకపోయాడో చర్చించారు. 'ప్రయోగం కోసం ప్రయోగం చేయకూడదు. అలా చేసిన రచనలు నిర్జీవ ప్రతిమల్లా సాహిత్య మ్యూజియాలకు పరిమితం అవుతాయి. ప్రయోగం కోసమే ప్రయోగాత్మకంగా చేసిన రచనలు తెలుగులో కొన్ని వెలుబడ్డాయి. చండీదాస్ అనుక్షణికం కూడా ఈ కోవకు చెందిందే. సామాజిక జీవితానికి దూరంగా ఉండేవాడు అస్తిత్వవాద రచయిత కాలేడు" అని రవికుమార్ పేర్కొన్నారు. జాతశ్రీ 'కుట్ర' కథాసంపుటికి, శిరంశెట్టి కాంతారావు 'కంచి మేకలు' కథా సంపుటికి రాసిన ముందుమాటల్లోనూ, వివిధ సందర్భాల్లో కథల మీద ఉపన్యాసాలు ఇచ్చినప్పుడు లోతైన చూపుతో చర్చించారు. "రచయితను కుదిపిన ప్రతి అంశమూ కథా వస్తువు కాలేదు. వస్తు స్వభావాన్ని బట్టి అది తాను ఇమిడిపోయే ప్రక్రియను నిర్ణయించుకుంటుంది. రచయితలు తమ రచనల ద్వారా పాఠకుల్లో ఉండే సెంటిమెంట్లను, మూఢ విశ్వాసాలను, బలహీనతలను బలహీనం చేయాలి గాని వాటికి బలం పెంచకూడదు. సాధారణంగా కథను ఒక ఊపులో చదవగలగాలి. భాష విషయంలో కథా రచయిత లోభివాడిలాగా వ్యవహరించాలి. ప్రచురణకర్తలు పొరపాటున ఒక్క మాటను అచ్చు వేయకపోయినా పాఠకుడికి ఆ కథ అర్థం కాకూడదు. కథలో కూర్పు అంత చిక్కగా ఉండాలి." అని కథ గురించి చక్కని అవగాహన ఇచ్చారు. అరసం ప్రచురించిన హిమాయత్ గారి కథా సంపుటికి ముందుమాట రాస్తూ, ఇలా అన్నారు : "కుల పీడన, ఆర్థిక దోపిడీ అనేవి ఈనాటి వర్గ శత్రువుకున్న రెండు ప్రధాన లక్షణాలు. ఏ ఒక్కదానితోనో పోరాడితే అది తాత్కాలిక విజయమో, పాక్షిక విజయమో అవుతుంది. ఏకకాలంలో ఈ రెంటిపైనా యుద్ధం ప్రకటిస్తేనే సంపూర్ణ విజయాన్ని సాధించగలం."

రవికుమార్‌కి ఏ అంశం ఇచ్చినా అందులో ఎవరూ చూడని ప్రత్యేక కోణం చూస్తారు. ఆయన విశ్లేషణ, విమర్శ విన్నాక ఈ కోణంలో మనమెందుకు ఆలోచించలేకపోయామని అనుకుంటాం. రవికుమార్ మాట్లాడడానికి చూపేంత ఉత్సాహం ఎందుకనో రాయడానికి చూపరు. అందువల్లనే ఆయన వివిధ సమావేశాల్లో, సభల్లో, సదస్సుల్లో చేసిన ప్రతిపాదనలు, లోతైన కోణాలు చాలావరకు గాలిలో కలిసిపోయాయి. ఇప్పటికైనా అందుబాటులో ఉన్న ఆయన ముందుమాటలు, వ్యాసాలు, ఆన్‌లైన్ ప్రసంగాలను ప్రచురణ రూపంలోకి తీసుకురావడం ఉపయోగకరమని సాహితీ ప్రియుల అభిలాష.

(ఈనెల 9న ఆచార్య మేడిపల్లి రవికుమార్ గారికి కాకినాడలో అద్దేపల్లి విమర్శక పురస్కారం అందిస్తున్న సందర్భంగా)

- డాక్టర్ సుంకర గోపాల్
94926 38547

సాధికార స్వరం శిలాలోలిత కవిత్వం

పుస్తకం

కొందరి కవిత్వం కోసం ప్రత్యేకించి ఆసక్తిగా ఎదురుచూసే నాలాంటి పాఠక కవులుంటారు. కవిత్వాన్ని ఇబ్బడి ముబ్బడిగా రాసేసి పాఠకుల కోసం ఆత్రంగా ఎదురు చూసే కవులూ మరి కొందరు ఉంటారు. ఎవరో కోరుకుంటున్నారని, రాసేస్తే కొన్ని అవకాశాలు అందుకోవచ్చు గదా అని, మరెవరి మెప్పుకోసమో వెనక్కి తిరిగి చూసుకోకుండా రాసే కవులూ ఉన్నారు. ఇవాళ ఇక్కడి భూమిలోంచొ ఓ నిశ్శబ్ద కవితా వీచిక మాట్లాడుతోంది. రాయకుండా ఉండలేని ఒకానొక మానసిక బలహీనతలోంచి అనివార్యంగా ఓ కవయిత్రి మాట్లాడుతోంది. నేను కూడా ఆమె కవిత్వాన్ని అభిమానిస్తాను. ఆమె వ్యక్తిత్వ సంస్కార శోభిత గుణాన్ని, కవిత్వం పట్ల వారికున్న నిబద్ధతను అభిమానిస్తాను. ఆ కవయిత్రి శిలాలోలిత. ఆమెది అరుదైన భావుకత, గాఢమైన అభివ్యక్తి, సూక్ష్మ పరిశీలన, సరళ సాత్విక మృదుత్వం కలగలిసిన సృజనాత్మకత.



పి.లక్ష్మి 1988లో శిలాలలితగా జన్మనెత్తిన తర్వాత నుంచి వారి కవిత్వంతో నాకు పరిచయమే. తన్ను తాను అన్వేషించుకొనే క్రమంలో తనదైన శుద్ధ, తాత్విక అంతశ్చేదనే కవిత్వమై వెలికి వస్తూ ఉంటుంది. 1993లో వచ్చిన వీరి ఎంఫిల్ గ్రంథం 'కవయిత్రుల కవిత్వంలో స్త్రీ మనోభావాలు' నాకెంతగానో నచ్చిన గ్రంథం. ఆ దశకంలో అది స్త్రీవాద దక్పథంలోంచీ వచ్చిన, మంచి రిఫరెన్స్ గ్రంథం.

"నేను మరణించను.. అవును
ఈ నెత్తుటిలో కొత్త పుట్టుక నాది
ఈ పుట్టుక నా సొంతం
జనన మరణాల పట్టికను
నేనే తయారు చేసుకోగలను
పంజరాన్ని నేనే, పక్షిని నేనే," అంటూ ఎలుగెత్తి పాతికేళ్ళు దాటింది. .

"నేను ఇక్కడి భూమిని /వందల ఏళ్ళ అనుబంధం నాది
ఈ పేరుతో నా సంభాషణ/ ఈ నేల అంతా పాతది
ఈ ప్రకృతిలో నేనూ ఒక భాగం
ఈ గాలి గుసగుసల్లో ఈ చెట్టూ చేమా పచ్చదనంలో
ఈ ఆకాశపు ఆత్మీయులతో
నేను ఓ భాగం నా ఉనికి ఇదే
నేనే ఈ భూమిని ఇక్కడి భూమిని! **(నేను ఇక్కడి భూమిని - 2022)** అంటూ పాతికేళ్ళు గడిచిపోయినా ఏమాత్రం తడబాటు లేని స్వరంతో వచ్చిన ఇవాళ్టి వారి కవిత్వం గొప్పగా ఉంది.

మొదటి కవితలో బొబ్బలెక్కిన అరికాళ్ళ మంటలతో, మొక్కవోని ధైర్యంతో, ఎర్ర సంతకమై కదిలిన రక్తం మెతుకులను ఆర్ద్రంగా పరామర్శిస్తారు కవయిత్రి.

"పండించిన గింజ మీద చెరిగిపోయిన సంతకం/ ఎవరు చెరిపేశారో, చెరిపేస్తున్నారో అందరికీ తెలుసు" అంటూ నిక్కచ్చిగా ప్రకటించారు. నడుస్తున్న శవాల మధ్య దవాఖానలో ఒక రోజును గడిపిన వైనాన్ని, అక్కడ చావుకు ముందు ఖరీదైన దోపిడీని కళ్ళారా చూసిన దృశ్యాలను కళ్ళ ముందు నిలిపారు.

"నినాదాలన్నీ చరిత్రలైతే..
బేటీ బచావో, బేటీ పఢావో
అయేషా నుంచీ అసిఫా దాకా
సబ్ టీక్ హై .. అని ప్రశ్నిస్తోంది.

ఎవరీ లేలేత నవ్వుల మృదులలు? అమ్మా నాన్నల ఈ భవిష్యత్ విత్తనాల్ని ఇక్కడ దాచాలి? వావి వరుసలు మరిచిన మానవ మృగాల బారి నుండి ఈ లేలేత ప్రపంచాల్ని ఎక్కడ ఏ సొరంగాల్లో దాచాలి? పాలు తాగాల్సిన నోళ్ళు వీర్యాన్ని కక్కుతుంటే ఎక్కడికి పారిపోవాలి? ఈ వేదన ఒక్క ఈ కవయిత్రిదే కాదు; ఈ భూమ్మీద సకల తల్లుల వేదన. అమ్మ కడుపులోంచే ఆత్మహత్యలు మొదలౌతుంటే మనకు మనమే ఆయుధాలం, ఆత్మగౌరవ పతాకాలం కావాలి తప్పదంటారు కవయిత్రి. మన కళ్లెదుటే మనుషుల ముసుగులు జారిపోతున్నప్పుడు, ఆత్మలు విరుగుతున్న శబ్దాలను గుర్తుపట్టడమే జీవితమంటారు. వరవర రావు గురించి చెబుతూ.. అది సృజనకారుడి చూపుడు వేలుగా, రెపరెపలాడే జెండాగా అభివర్ణిస్తారు.

"ఆమె ఒక కొత్త దేహపటం, మిణుకు మిణుకుమంటున్న దీప స్తంభం, ఒక నిప్పుల కుంపటి, ఒక రక్త సిక్త నిఘంటువు. ఇప్పుడామె ఆడది కాదు మనిషి, ఇవాళ్టి మానవి" అంటూ వర్తమాన మహిళకు ఒక వినూత్న నిర్వచనమిచ్చిన కవయిత్రి. ఇప్పుడు స్త్రీ అంటే కొలతల సమూహం కానే కాదు.. నిర్భయ సాధికారిక స్వరం.

"దేహానికి ప్రేమలేఖ కాదురా, దేశానికి రాయండి / అది మన ఉనికికే పోరాట మౌతుందం"టారు. నాన్న జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ తడుముకున్నారు, తలపోసుకున్నారు. తన మనసు గదిలోకి వెళ్లి తలుపేసుకున్నారు. "నాన్న నాలోనే నాతోనే ఉన్నారు. నాన్నతో ఇలా అప్పుడప్పుడు సంభాషిస్తూనే ఉంటాను" అంటూ 2008లో తన్ను వీడి వెళ్ళిపోయిన నాన్న పురిటిపాటి రామిరెడ్డి గారిని మళ్లీ మళ్లీ తలుచుకుంటూ ఆ జ్ఞాపకాలతో కళ్ళు తడిపేసుకుంటూ ఉంటారు కవయిత్రి.

ఓడిన ప్రతిసారీ కూడదీసుకుని బతకడం మన కలవాటే నంటారు. మనిషి ఏక వచనం కావచ్చు, మనిషితనం మాత్రం బహువచనమే అంటారు.

"శరీరమున్నది హింసకేనా?/ కులం ఉన్నది కూల్చడానికేనా?/ మతం ఉన్నది ముంచడానికేనా?/ ఈ భూస్థలమంతా రాలి పడుతున్న ప్రాణాల చప్పుడు.. / భయాన్ని జయించినప్పుడే / నిర్భయ జీవితం మిగులుతుంది." అని విస్పష్టంగా ప్రకటిస్తారు.

"మనది అనివార్య నిర్బంధ జీవనం/ స్వయం నిర్మిత జైలు గోడల మధ్యే ఉన్నాం/ మనమందరం ఇప్పుడు జైళ్లల్లోనే ఉన్నాం తాళాలు మన దగ్గరే ఉన్నా తీయలేం/ స్వయం నిర్మిత ఊచల మధ్య మనం, మన జీవితం.

ఇక్కడ స్త్రీని సింబాలిక్‌గా తీసుకొని నవ నవోన్మేష రూపిణీగా చిత్రించారని పిస్తోంది నాకు.

"ఆమె ఒక హిమాలయమై/ ఘనీభవించగలదు ద్రవించగలదు/ తాను గడ్డిపువ్వు కాదు/ సరసరసరమని కోసే మొగలి పువ్వు / ఆమె ఆత్మాభిమాన, ఆత్మవిశ్వాసాల / నిలువెత్తు ప్రేమమూర్తి / అమ్మ కడుపులో ఆదమరిచిన/ నిద్ర తరువాత శాశ్వత నిద్రలో/ దొరికే విశ్రాంతి మినహా .. కంటి నిండా, కడుపారా హాయిగా నిద్దురపోవాలని ఉన్న పసిపాప/ పసిపాపగా ఆమె తనకు పుట్టినప్పుడు తెలీదు నేనే ఇల్లయి పోతానని, తనది అనుకుంటున్న ఇల్లు తనది కాదని తర్వాతనే తెలిసింది.

నవ్వుతూ బతకాలని ఆమె కోరిక / ఆమె వెన్నొక వంచిన విల్లు / మొదుగు పూలే కంటి ఇల్లు/ ఒక్కొక్క నయా పైసా ముడు లేసి ఇంటిని భుజానమోస్తున్న ఆర్థిక మంత్రులు వాళ్ళు..

ఇలా నవ స్త్రీలను, నవ్య స్త్రీలుగా చెక్కిన కవితా శిల్పాలు ఈ కవితలు. ఇలా కవిత కవితని పరామర్శిస్తోంటే కొన్ని గరుకుగా, కొన్ని మార్దవంగా, లాలిత్యంగా, మదు మధురంగా,ఆత్మ విశ్వాసంగా, సత్య సౌందర్యంగా మహిళల ప్రతిరూపాలుగా నాకు వారి ప్రతి భావన లోనూ, నాకు దర్శనమిచ్చారు. ఇలా సంపూర్ణ స్త్రీత్వాన్ని ఆవిష్కరించిన కవయిత్రిగా శిలాలోలిత గారిని మనః పూర్వకంగా అభినందిస్తూ ఉన్నాను. కవిత్వంలో నిరాడంబరతను ప్రేమించే శిలాలోలిత "నేను ఇక్కడి భూమిని" అంటూ ఈసారి కాస్త స్వరం పెంచి కటువుగానూ మాట్లాడారు. ఏమైతేనేం, మంచి కవిత్వాన్ని చదివిన అనుభూతి కలిగించిన కవయిత్రికి హృదయపూర్వక అభినందనలు.

- డాక్టర్ రాధేయ
99851 71411



శతాబ్దాన్ని స్పర్శించిన మహాకవి

నివాళి

ప్రముఖ ద్విభాషా కవి, సాహితీవేత్త జయంత మహాపాత్ర 2023 ఆగస్టు 27న ఒడిశాలోని కటక్‌లోని ఒక ఆసుపత్రిలో మరణించారు. ఆయన వయసు 95. జయంత మహాపాత్ర ఆంగ్ల కవిత్వానికి సాహిత్య అకాడమీ అవార్డును గెలుచుకున్న మొదటి భారతీయ కవి. అతనికి 2009లో పద్మశ్రీ కూడా లభించింది. దేశంలో పెరుగుతున్న అసహనానికి నిరసనగా 2015లో ఆయన దానిని ప్రభుత్వానికి తిరిగి ఇచ్చాడు.

ఆధునిక భారతీయ ఆంగ్ల సాహిత్యంలో క్లాసిక్‌లుగా పరిగణించబడే 'ఇండియన్ సమ్మర్', 'హంగర్' వంటి పద్యాలను రచించినందుకు ఆయన బాగా పేరు పొందాడు. ఆయన ఇతర ప్రముఖ రచనల్లో 'రిలేషన్ షిప్', 'బేర్ ఫేస్', 'షాడో స్పేస్' కూడా ఉన్నాయి. మొత్తంగా మహాపాత్ర 27 కవితా సంపుటాలు వెలువరించారు. వాటిలో ఏడు ఒరియా కాగా, మిగిలినవి ఆంగ్లంలో ఉన్నాయి. 1981లో ఆయన రాసిన 'రిలేషన్ షిప్' పుస్తకానికి సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది.

మహాపాత్ర గద్యంతో కూడా ప్రయోగాలు చేశాడు. 'గ్రీన్ గార్డనర్' పేరిట చిన్న కథల సంపుటి, 'డోర్ ఆఫ్ పేపర్' పేరిట వ్యాసాల సంపుటి వెలువరించారు. డోర్ ఆఫ్ పేపర్ నిజంగా ప్రత్యేకమైన పుస్తకం. ఇది ఆయన కవిత్వ సిద్ధాంతాన్ని ప్రతిబింబిస్తుంది.

అక్టోబరు 22, 1928న కటక్‌లో ప్రముఖ ఒడియా క్రైస్తవ కుటుంబంలో జన్మించిన మహాపాత్ర కటక్‌లోని స్టీవర్ట్ పాఠశాలలో చదివి పాట్నా విశ్వవిద్యాలయం నుంచి భౌతికశాస్త్రంలో మాస్టర్స్ పూర్తి చేశారు. ఒడిశాలోని వివిధ ప్రభుత్వ కళాశాలల్లో భౌతికశస్త్ర అధ్యాపకుడిగా పనిచేశారు. తన అరవైల చివరలో రచనా జీవితాన్ని ప్రారంభించాడు. ప్రారంభంలో ఆయన రాసిన చిన్న కథలు, కవితలు ప్రచురణకర్తల తిరస్కారానికి గురయ్యాయి. ఆయన కవితలు అంతర్జాతీయ సాహిత్య పత్రికల్లో ప్రచురించబడే వరకూ స్థానికంగా గుర్తింపు రాలేదు.

సార్క్ రచయితల సదస్సుల్లో కొన్నిసార్లు, పాండిచ్చేరి యూనివర్శిటీలో ఒకసారి ఆయన్ని కలిసాను. సింపుల్ లివింగ్ అండ్ హై థింకింగ్ కల సహృదయుడు ఆయన. ఆయన మాటలు వినడం అందరికీ ఇష్టం. జయంత మహాపాత్రతో కలిసి నా పద్యాన్ని చదవడం, నా పక్కనే ఆయన కూర్చొని, నా కవితపై శ్రద్ధ పెట్టడం నాకు ఒక రివార్డింగ్ అనుభవం! 'క్లోజ్ ది స్కై' (1971)తో ప్రారంభించి, 95 సంవత్సరాల వయసులో 'మధ్యాహ్నం: కొత్త, ఎంపిక చేసిన పద్యాలు' (2023)తో తన రచనా రచనా ప్రస్థానాన్ని ముగించిన మహాపాత్ర భారతీయ ఆంగ్ల కవిత్వంలో ఆధునికతకు కొత్త పునాదిని నిర్మించారు. ఆయన కవిత్వ లోకంలో చిరస్థాయిగా నిలిచిపోతారు.

- డాక్టర్ పెరుగు రామకృష్ణ
98492 30443

రెక్కల గుర్రం



కొన్నాళ్లే ఉంటాయి
ఈ క్షణాలు
మిడిసిపడుతూ ఎగిరి పడుతూ విర్రవీగుతూ
ఈ అధికార కిరీటాలు ధగధగలాడుతూ
ఈ అహంకార భుజకీర్తులు వెలిగిపోతూ
ఏ చరిత్ర పుటలు ఏ కీర్తి చంద్రికలు
ఎంతవరకు తలదన్ని నడుస్తాయి
కాలాన్ని వీపున గట్టుకున్న సద్ది మూటలా
సాగే కొద్ది భారమైపోయి
ఒక్కో గడియ కరిగి
ఒక్కో మెతుకు రాలి
కాళ్ళు విరిగిన పడవ
చూపు తెగిన చుక్కాని
తీరం తెలియదు
ఏ దిక్కు తానున్నట్టు ప్రకటించదు
మధ్యమధ్య రాకాసి అలలు
అలలు సంహరించే ఆయుధం లేదు చేతిలో
దగ్ధమవుతున్న అడవుల్లా
దుఃఖపు పెనుమంటలు
ఆవరించిన శ్మశానాల్లా
దొర్లి దొర్లి ఏడుస్తున్నాయి కాంక్షలు
ఒకటి దూరమై మరొకటి దగ్గర అయినట్టు
ఒక్కోసారి అన్ని దూరంగా జరిగిపోయినట్టు
ప్రపంచమంతా గుప్పెడు మట్టిగా మారి
ఊపిరి సొరంగాలను కప్పేసినట్టు
రాత్రులు గుడ్డి గుర్రాలుగా పరిగెడుతున్నాయి
నిశ్శబ్ద స్వప్నాలు
మహా విస్ఫోటనాలుగా వినిపిస్తున్నాయి
నిషిద్ధ వచనాలు సజీవ వాక్యాలుగా
నిలిచిపోతున్నాయి
పయనమై సాగే పక్షుల గుంపులా
ముసురు కప్పుతున్న మబ్బుల్లా జీవితం
చీకటి పడుతుంది
అది శూన్యంలా ఉంటుంది
ఇక
ఎప్పటిలాగే తెల్లరుతుందా రేపు ఉదయం
వీధిలో కుక్క విశ్వాసంగానే తోక ఆడిస్తుందా
పిడస ముద్ద పెట్టినందుకు
కాలం విశ్వాస ఘాతకిగానే మిగులుతుందా
మరణం మరింత దగ్గరవుతున్నట్టు
కొత్తగాలి వీస్తుంది సమాధుల మీదుగా...

- లోసారి సుధాకర్
99499 469916

రేపు 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికలు

- ముగిసిన ప్రచార పర్వం

న్యూఢిల్లీ : ఆరు రాష్ట్రాల్లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల కోసం ఆదివారంతో ప్రచార పర్వం ముగిసింది. ఈ నెల 5న ఈ స్థానాల్లో ఉప ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని ధూప్‌గురి, ఉత్తరాఖండ్‌లోని బగేశ్వరి, కేరళలోని పుతుపల్లి, ఉత్తరప్రదేశ్‌లోని ఘోసి, త్రిపురలోని ధన్‌పుర్, బోక్సానగర్, జార్ఖండ్‌లోని దుమ్రి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ ఉప ఎన్నికలు జరగనున్నాయి. కేరళలోని పుతుపల్లి నియోజకవర్గంలో ఊమెన్ చాందీ మృతితో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఊమెన్ చాందీ కుమారుడు చాందీ ఊమెన్ పోటీ చేస్తుండగా, సిపిఎం అభ్యర్థిగా జైక్ సి థామస్ పోటీలో ఉన్నారు.

కర్ణాటకలో మళ్లీ ఆపరేషన్ కమలం : ఎమ్మెల్యే ఈశ్వరప్ప

బెంగళూరు : ప్రజాతీర్పును గౌరవించకుండా అధికారమే పరమావధిగా రాజకీయం చేయటం బిజెపికి అలవాటుగా మారింది.. కర్ణాటకలో త్వరలో ఆపరేషన్ కమలం ప్రారంభం కానున్నదని బిజెపి నేత కె.ఎస్. ఈశ్వరప్ప ఆదివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండదని అన్నారు. కర్ణాటకలో ఆపరేషన్ కమలం ప్రారంభమవుతుందని వందశాతం హామీ ఇవ్వగలనని స్పష్టం చేశారు. దేశంలో కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు లేదని, 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆ పార్టీ ఏ రాష్ట్రంలోనూ అధికారంలో ఉండదని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య సఖ్యత లేదని, 17 మంది ఎమ్మెల్యేలు బిజెపితో టచ్‌లో ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు, డికె శివకుమార్‌కు మధ్య పలు అంశాలపై విభేదాలు ఉన్నాయని చెప్పారు. రాజకీయ సమీకరణలు చూసుకుని అవకాశం రాగానే ఆపరేషన్ కమలం అమలు చేసి అధికారంలోకి వస్తామని తెలిపారు.

ఆస్పత్రిలో చేరిన సోనియా

- తేలికపాటి జ్వరంతో ఢిల్లీలోని హాస్పటల్‌లో చికిత్స
- పరిస్థితి నిలకడగా ఉందన్న వైద్యులు



న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ తేలికపాటి జ్వరం కారణంగా ఢిల్లీలోని ఒక ఆస్పత్రిలో చేరారు. సర్ గంగారామ్ ఆస్పత్రి వైద్యులు ఆమెకు చికిత్స చేశారు. ఆమె పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉన్నదని వైద్యులు తెలిపారు. ఆమె వైద్యుల పరిశీలనలోనే ఉన్నారు. గతనెల 31న ముంబయిలో జరిగిన 'ఇండియా' కూటమి సమావేశానికి తన కుమారుడు రాహుల్ గాంధీతో కలిసి ఆమె హాజరైన విషయం తెలిసిందే. ఈ ఏడాదిలోనే ఆమె ఇప్పటి వరకు రెండుసార్లు ఆస్పత్రిలో చేరిన విషయం విదితమే. ఈ ఏడాది జనవరిలో ఇన్ఫెక్షన్ కారణంగా, మార్చిలో జ్వరం కారణంగా సర్ గంగారామ్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు.

5న 'ఇండియా' ఫ్లోర్ లీడర్ల సమావేశం

న్యూఢిల్లీ : ఈ నెల 5న ఇండియా ఫోరం ఫ్లోర్ లీడర్ల సమావేశం జరగనుంది. ఇక్కడి రాజాజీ మార్గ్‌లో కాంగ్రెస్ అధ్యక్షులు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే అధికారిక నివాసంలో ఫ్లోర్ లీడర్ల సమావేశం కానున్నారు. ఈ నెల 18 నుంచి 22 వరకూ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఆదివారం ఖర్గే తెలిపారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో తమ వ్యూహాన్ని నిర్ణయించుకోవడం కోసం ఫ్లోర్ లీడర్ల సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు సంబంధించిన ఎజెండాను కేంద్ర ప్రభుత్వం ఇంకా వెల్లడించనప్పటికీ.. జమిలి ఎన్నికల అంశంపై ప్రభుత్వం చర్చించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

'సనాతన'ను నిర్మూలించాలి

- అది సామాజిక న్యాయానికి వ్యతిరేకం
- తమిళనాడు రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు



చెన్నై : సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ అన్నారు. సనాతన వాదం సామాజిక న్యాయానికి వ్యతిరేకం అని చెప్పారు. ముఖ్యమంత్రి, డిఎంకె అధినేత తనయుడు అయిన ఉదయనిధి స్టాలిన్ ఆదివారం తమిళనాడు ప్రొగ్రెస్సివ్ రైటర్స్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఇక్కడ నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సనాతన వాదం అనేది సామాజిక జాడ్యం అని అన్నారు. దోమలు, డెంగీ మలేరియా, కరోనా వ్యాధులను నిర్మూలించేందుకు పోరాడినట్లే పోరాడాలని అన్నారు. "కొన్ని అంశాలను వ్యతిరేకించలేము, వాటిని నిర్మూలించాలి. మనం సనాతన (సనాతన ధర్మం)ను వ్యతిరేకించటం కంటే నిర్మూలించాలి. సనాతన అనేది సంస్కృతం నుంచి వచ్చింది. ఇది సామాజిక న్యాయం, సమానత్వానికి వ్యతిరేకం" అని ఉదయనిధి స్టాలిన్ అన్నారు.

బిజెపి అభ్యంతరం..

తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానన్న ఉదయనిధి

ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలపై బిజెపి రయ్యన లేచింది. ఉదయనిధి వ్యాఖ్యలపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దగ్గర నుంచి ఆ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడి దాకా తీవ్రంగా స్పందించారు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం సనాతన ధర్మాన్ని ప్రతిపక్షాలు అవమానిస్తున్నాయని అమిత్‌షా రుసరుసలాడారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై మాట్లాడుతూ, ఉదయనిధి హానికరమైన సిద్ధాంతాన్ని వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు. బిజెపి ఐటి విభాగం ఇన్‌చార్జ్ అమిత్ మాలవీయ..

ఉదయనిధి స్టాలిన్ మాట్లాడిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. దీనికి ఉదయనిధి స్టాలిన్ ట్వీట్ చేస్తూ, తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని చెప్పారు. తాను సనాతన ధర్మం వల్ల బాధను అనుభవించిన అణగారిన వర్గాల తరపున మాట్లాడానని పేర్కొన్నారు. న్యాయపరంగానైనా, ప్రజా కోర్టులోనైనా ఎదుర్కోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు. అసత్య, నకిలీ వార్తల ప్రచారాన్ని మానుకోవాలని సూచించారు.

మణిపూర్ అల్లర్ల కట్టడికి సర్జికల్ స్ట్రైక్ కమాండర్

- ఎస్ఎస్‌పిగా రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ నెక్టార్ సంజెన్‌బామ్
- అశాంతికి తెర దించేందుకు నియామకం అంటున్న కేంద్రం
- ఓ గ్రూపును టార్గెట్ చేయటానికే : రాజకీయ పరిశీలకులు



ఇంఫాల్ : మణిపూర్‌లో శాంతి పరిస్థితులు నెలకొనటం అంత సులువుగా కనబడటం లేదు. ప్రతిరోజూ ఎక్కడో చోట కాల్పుల మోతలు, మరణాలు చోటు చేసుకుంటున్నాయి. రాష్ట్రంలో పరిస్థితిని అదుపులోకి తీసుకురావటానికి సర్జికల్ స్ట్రైక్ కమాండర్, రిటైర్డ్ కల్నల్ నెక్టార్ సంజెన్‌బామ్‌ను కేంద్రం రంగంలోకి దింపింది. గతనెల 24న రాష్ట్ర ప్రభుత్వం ఆయనను సీనియర్ సూపరింటెండెంట్ (కోంబాట్)గా నియమించింది. ఐదేళ్ల పాటు ఆయన ఈ పదవిలో ఉండనున్నారు. రాష్ట్రంలో దాదాపు మూడు నెలలకు పైగా కొనసాగుతున్న అశాంతికి ఇప్పటికీ తెరపడటం లేదు. పైగా రాజకీయంగా బిజెపి ప్రభుత్వానికి సంకటంగా మారింది. దీంతో శౌర్యచక్ర, కీర్తి చక్ర గ్రహీత అయిన సంజెన్‌బామ్‌కు బాధ్యతలు అప్పగించింది. మోడీ ప్రభుత్వం కావాలనే.. ఓ వర్గాన్ని టార్గెట్ చేయటానికే సంజెన్ బామ్‌ను నియమించిందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. 2015లో మయన్మార్‌లో భారత్ జరిపిన సర్జికల్ స్ట్రైక్స్‌లో కీలక పాత్ర పోషించారు. ఆర్మీ అధికారిగా ఆయన 21 పారా(స్పెషల్ ఫోర్సెస్)లో పని చేశారు. జూన్ 12 నాటి క్యాబినెట్ నిర్ణయం తర్వాత నియామకం జరిగిందని మణిపూర్ జాయింట్ సెక్రెటరీ (హోమ్) ఆగస్టు 28న జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భూగర్భ జలాలు అడుగంటుతాయ్

- 2080 నాటికి భారత్‌లో మూడు రెట్లు నీటిని కోల్పోయే ప్రమాదం
- మిచిగాన్ విశ్వవిద్యాలయం అధ్యయనం



న్యూఢిల్లీ : భారత్‌లోని భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదమున్నదని మిచిగాన్ విశ్వవిద్యాలయం నేతృత్వంలోని ఒక అధ్యయనం హెచ్చరించింది. భారతీయ రైతులు ప్రస్తుత రేటుతో భూగర్భ జలాలను వినియోగిస్తే భూగర్భజలాల క్షీణత రేటు 2080 నాటికి మూడు రెట్లు పెరుగుతుందని తెలిపింది. ఇది దేశ ఆహారం, నీటి భద్రతతోపాటు జీవనోపాధిపై తీవ్ర ప్రభావాలను కలిగిస్తుందని వివరించింది. భూగర్భజలాల క్షీణత, వాతావరణ మార్పుల కారణంగా భారత్‌లో తగ్గిన నీటి లభ్యత దేశంలోని ప్రజలలో మూడింట ఒక వంతు మంది జీవనోపాధికి ముప్పు కలిగిస్తుందని వెల్లడైంది.

ఈ అధ్యయనం వెల్లడించిన సమాచారం ప్రకారం.. భారత్‌లో వేడెక్కుతున్న వాతావరణం రైతులను భూగర్భ జలాలను అధికంగా వినియోగించేలా చేసింది. ఈ అధ్యయనాన్ని సైన్స్ అడ్వాన్సెస్ జర్నల్‌లో ప్రచురించారు. "భూగర్భ జలాల వినియోగంలో భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారు. ప్రాంతీయ, ప్రపంచ ఆహార సరఫరాకు కీలకమైన వనరుగా ఉన్నందున ఇది ఆందోళన కలిగిస్తుంది" అని యూనివర్సిటీ స్కూల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అండ్ సస్టైనబిలిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సీనియర్ రచయిత్రి మేహ జైన్ అన్నారు. భారత్ అంతటా భూగర్భజలాల నష్టాన్ని అంచనా వేయడానికి భూగర్భజల స్థాయిలు, వాతావరణం, పంట నీటి ఒత్తిడిపై చారిత్రక సమాచారం ఆధారంగా అధ్యయనం విశ్లేషించింది.

అధ్యయనంలో భాగంగా చాలా నమూనాలు రాబోయే దశాబ్దాలలో భారత్‌లో పెరిగిన ఉష్ణోగ్రత, పెరిగిన రుతుపవనాల (జూన్ నుంచి సెప్టెంబర్ వరకు) అవపాతం, శీతాకాలపు అవపాతం తగ్గడం వంటి వాటిని పరిశీలించారు. వివిధ వాతావరణ మార్పుల పరిస్థితులలో, 2041 నుంచి 2080 మధ్య భూగర్భజలాల స్థాయి క్షీణత గురించి వారి అంచనాలు సగటున ప్రస్తుత క్షీణత రేటు కంటే మూడు రెట్లు ఎక్కువ అని వారు చెప్పారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో భారత్‌లో ఆహారం, నీటి భద్రతను మరింత సవాలు చేస్తుందనిని భట్టారాయ్ చెప్పారు.

దూప్‌గురిలో సిపిఎం విస్తృత ప్రచారం

దూప్‌గురి : పశ్చిమ బెంగాల్‌లోని దూప్‌గురి అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికలో సిపిఎం అభ్యర్థి ఈశ్వర్ చంద్రరాయ్‌కి మద్దతుగా ఆ పార్టీ ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించింది. పలు ప్రాంతాల్లో ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించడంతోపాటు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో టిఎంసి హింసాకాండను, బిజెపి మతతత్వ రాజకీయాలను ఓడించాలని, సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు సుజన్ చక్రవర్తి, రాష్ట్ర నాయకులు జీవేష్ సర్కార్, సలీల్ ఆచార్య, మీనాక్షి ముఖర్జీ, ధృవజ్యోతి సాహ తదితరులు పాల్గొన్నారు.



'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' ఇవిఎంలకే రూ.10 వేల కోట్లు

న్యూఢిల్లీ : పొదుపు, అభివద్ధికి అడ్డంకులు తొలగాలన్న వాదనలతో బిజెపి ముందుకు తెచ్చిన 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' కోసం భారీ మొత్తంలో నిధులు వెచ్చించాల్సి వస్తోంది. 2015లో పార్లమెంట్ లీగల్ అండ్ పర్సనల్ స్టాండింగ్ కమిటీ సమర్పించిన అంచనాల ప్రకారం కేవలం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఇవిఎం)లకే లోక్ సభ, శాసనసభలకు కలిపి ఎన్నికలు నిర్వహించాలంటే రూ.9284.15 కోట్లు అవసరం. 2014 నుంచి 2019 వరకు కేంద్రం రాష్ట్రాలకు రూ.5,814.29 కోట్లు మాత్రమే ఇచ్చింది.ఇవిఎంలు, ఓటర్ వెరిఫైయబుల్ పేపర్, ఆడిట్ ట్రయిల్ మెషీన్లు తదితరాలను పెద్దమొత్తంలో కొనుగోలు చేయాల్సి ఉంటుందని, పదిహేనేళ్ల జీవితకాలం ఉన్న ఇవిఎంలను మూడు రెట్లు మాత్రమే ఉపయోగిస్తే ఖర్చు పెరుగుతుందని నివేదిక పేర్కొంది. మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఒపి రావత్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. 2015లో దీనిపై అధ్యయనం చేయాలని కేంద్రం ఎన్నికల సంఘాన్ని కోరినప్పుడు రావత్ అందులో సభ్యుడు. కనీసం 30 లక్షల ఇవిఎంలు, వివి ప్యాట్‌లు అవసరం. రాజ్యాంగ, ప్రజాప్రాతినిధ్య చట్టం సవరణలు అవసరం. ప్రస్తుతం భారత్‌లో ప్రపంచంలోనే అత్యంత చౌకగా ఎన్నికలు జరుగుతున్నాయి. ఓటుకు ఒక్క డాలర్ మాత్రమేనని రావత్ తెలిపారు. మరో మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ టిఎస్ కష్ణమూర్తి కూడా ఎన్నికలు పూర్తి కావడానికి కనీసం నాలుగు నెలల సమయం పడుతుందని చెప్పారు. వచ్చే ఏడాది ఇవిఎంల నిర్వహణ చాలా కష్టమని టెక్నికల్ కమిటీ సభ్యుడు తెలిపారు. రజత్ మూనా కూడా స్పష్టం చేశారు. 6-7 లక్షల ఇవిఎంల తయారీకి కనీసం ఏడాది సమయం పడుతుందని చెప్పారు. మార్చి వరకు కమిషన్ వద్ద 13.06 లక్షల కంట్రోల్ యూనిట్లు (సియు), 17.77 లక్షల బ్యాలెట్లు మాత్రమే ఉన్నాయని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి పార్లమెంటుకు తెలిపారు. దేశమంతటా ఏకకాలంలో కేంద్ర సైన్యాన్ని మోహరించడం వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ మాత్రం తన వైఖరిని స్పష్టం చేయలేదు.



లక్ష్యం దిశగా దూసుకుపోతున్న ఆదిత్య

- మొదటి విన్యాసం విజయవంతం
- మరొక విన్యాసానికి షెడ్యూలు నిర్ణయించిన ఇస్రో
- నాలుగు నెలల్లో నిర్దేశిత కక్ష్యలో ప్రవేశించనున్న ఆదిత్య ఎల్ -1

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సూర్యునిపై పరిశోధనకు ప్రయోగించిన ఆదిత్య ఎల్ -1 ఆదివారం మరొక మైలురాయిని అధిగమించింది. తన మొదటి అడుగును విజయవంతంగా వేసినట్లు ఇస్రో తెలియజేసింది. ఆదిత్య ఎల్ -1 ఉపగ్రహం ఆరోగ్యవంతంగా ఉందని, సాధారణంగా తెరుచుకుందని ఇస్రో తన తాజా ప్రకటనలో వివరించింది. తదుపరి విన్యాసాన్ని మంగళవారం ఉదయం 3 గంటలకు షెడ్యూల్ చేసినట్లు తెలిపింది. శ్రీహరి కోట నుంచి ప్రయోగించిన ఆదిత్య ఎల్-1 సూర్యుని మీద సవివరమైన అధ్యయనం జరపడానికి ఏడు వేర్వేరు పేలోడ్లను మోసుకెళుతున్న విషయం తెలిసిందే. వీటిలో నాలుగు పేలోడ్లు సూర్యుని నుంచి వచ్చే కాంతిని పరిశీలించనుండగా, మరో మూడు సూర్యుని ప్లాస్మా , అయస్కాంత క్షేత్రాలను అధ్యయనం చేయనున్నాయి. ఆదిత్య ఎల్ - 1 మిషన్ సూర్యుని దిశగా భూమి నుండి 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక వర్తులాకార కక్ష్య అయిన లాంగ్రేంగియన్ పాయింట్ 1 (ఎల్1)లో పరిభ్రమించనుంది. ఈ కక్ష్య సూర్యునికి, భూమికి మధ్య దూరంలో 1 శాతం ఉంటుంది. ఈ కక్ష్యలోకి ప్రవేశించడానికి ఆదిత్య ఎల్ - 1 మిషన్‌కు నాలుగు నెలల వ్యవధి పట్టనుంది.

ఆదిత్య ఎల్-1 సూర్యుని వెలుపలి వాతావరణాన్ని అధ్యయనం చేస్తుందని, సూర్యుడిని సమీపించడం గాని, సూర్యునిపై ల్యాండ్ కావడం గాని జరగదని ఇస్రో వెల్లడించింది. ప్రస్తుతం నిర్ణయించిన కక్ష్య గ్రహణాలు గాని, మరే ఇతర ఆటంకాలు గాని లేకుండా సౌర కార్యకలాపాలు, అంతరిక్ష వాతావరణంపై వాటి ప్రభావాలను వాస్తవ సమయం ఆధారంగా అధ్యయనం చేయడానికి శాస్త్రవేత్తలకు వీలుకల్పించనుంది. ఆదిత్య ఉపగ్రహం పంపే డేటా సౌర విస్ఫోటన ఘటనల ప్రక్రియల వరుస క్రమాన్ని గుర్తించి, అంతరిక్ష వాతావరణాన్ని ప్రభావితం చేసే కారకాలను మరింత లోతుగా అవగాహన చేసుకోవడానికి ఉపయోగపడనుంది.

సూర్యుని వెలుపరి పొర అయిన కరోనా, దాని ఉష్ణ యంత్రాంగం భౌతిక ధర్మాలను అధ్యయనం చేయడం, సౌర పవన త్వరణం, సౌర వాతావరణ గతిశీలత, సౌర వాయువుల వ్యాప్తి, ఉష్ణోగ్రత లక్షణాలు, కరోనా మాస్ ఎజెక్షన్స్, జ్వాలలు, భూమికి సమీపంలో ఉన్న అంతరిక్ష వాతావరణాన్ని అధ్యయనం చేయడం కోసం ఆదిత్య మిషన్‌ను ఇస్రో ప్రారంభించిన సంగతి తెలిసిందే.

జమిలి ఎన్నికలు భారత ఐక్యతపై దాడి

- రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : 'ఒకే దేశం - ఒకేసారి ఎన్నికలు.. భారత్ ఐక్యత, అన్ని రాష్ట్రాలపై దాడిగా" కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భారత్ అంటే రాష్ట్రాల సమాఖ్య అని, ఒకే దేశం, ఒకే ఎన్నికలు ఆలోచన దానిపై దాడి చేయడమేనని ఎక్స్ (ట్విటర్)లో ఆదివారం పోస్ట్ చేశారు.

'జమిలి ఎన్నికలపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయడం నామమాత్రపు ప్రక్రియే. దీన్ని ఏర్పాటు చేసిన సమయంపైనా అనుమానాలున్నాయి. దాని నియమ నిబంధనలను చూస్తే కమిటీ సిఫార్సులను ఇప్పటికే నిర్ణయించినట్లు తెలుస్తోంది. అందుకే కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి ఆ కమిటీలో ఉండేందుకు నిరాకరించడం సరైనదే' అని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు.

జమిలి ఎన్నికల నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీలో భాగమయ్యేందుకు కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి నిరాకరించారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేను కమిటీ నుంచి తప్పించడంపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖర్గేకు బదులుగా మాజీ ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్‌ను ప్రభుత్వం ఈ కమిటీలో చేర్చడం గమనార్హం.

జి 20 నేపథ్యంలో 207 రైళ్లు రద్దు

- 9 నుండి 11 వరకు రాకపోకలపై ఆంక్షలు

న్యూఢిల్లీ : జి 20 సదస్సు నేపథ్యంలో ఉత్తర రైల్వే 207 రైళ్లను రద్దు చేసింది. ఈ నెల 9 నుంచి 11 వరకు రైళ్ల రాకపోకలపై ఆంక్షలు విధించారు. దాదాపు 15 రైళ్ల రూట్‌ను మార్చామని, ఆరు రైళ్లను దారి మళ్లించామని రైల్వే శాఖ తెలిపింది. జమ్మూ తావీ - న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్, తేజస్ రాజధాని హజ్రత్ నిజాముద్దీన్, వారణాసి-న్యూఢిల్లీ తేజస్ రాజధానితో సహా అదనంగా 70 రైళ్లకు స్టాప్‌లు కేటాయించబడ్డాయి.

న్యూఢిల్లీలో ముగియాల్సిన 36 రైళ్లు ఘజియాబాద్, నిజాముద్దీన్ స్టేషన్లలో ముగుస్తాయి. సెప్టెంబర్ 10న వంద ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారు. వీటిలో ఎక్కువ భాగం ఢిల్లీ నుండి దక్షిణ హర్యానాలోని సోనిపట్-పానిపట్, రోహ్‌తక్, రేవారి మరియు పల్వాల్ మార్గాల్లో నడుస్తాయి. సెప్టెంబర్ 11 న ఢిల్లీ-రేవారి ఎక్స్‌ప్రెస్ స్పెషల్, రేవారి-ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ స్పెషల్ రైళ్లు రద్దు చేయబడ్డాయి.


సిర్సా తిలక్ బ్రిడ్జ్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 9 నుండి 11 గంటల వరకు, బరేలీ జంక్షన్-న్యూ ఢిల్లీ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, న్యూఢిల్లీ - రోహ్‌తక్ జంక్షన్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఉదయం 8 నుండి 10 గంటల వరకు రద్దు చేయబడ్డాయి. రద్దు చేయబడిన రైళ్లలో న్యూఢిల్లీ - వీరాంగన లక్ష్మీబాయి తాజ్ ఎక్స్‌ప్రెస్, న్యూఢిల్లీ - లోహియాన్ ఖాస్ జంక్షన్ సర్బత్ ఎక్స్‌ప్రెస్, భివానీ - తిలక్ బ్రిడ్జ్ ఎక్స్‌ప్రెస్, గంగానగర్ - తిలక్ బ్రిడ్జ్ ఎక్స్‌ప్రెస్, ఢిల్లీ - హరిద్వార్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్, జలంధర్ సిటీ జంక్షన్ - న్యూఢిల్లీ ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి.

ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో 9, 10 తేదీల్లో సమ్మిట్ జరగనుంది. సమ్మిట్ దష్ట్యా సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు ఢిల్లీలో పబ్లిక్ హాలీడే ప్రకటించారు. అన్ని ప్రభుత్వ, మున్సిపల్ కార్పొరేషన్, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు మూసివేయబడతాయి. ఈ మూడు రోజులు బ్యాంకులు, దుకాణాలు సహా ఆర్థిక సంస్థలు పని చేయవు.

ప్రయాణికులు రైళ్ల సమాచారం, సమయాలను సరిగ్గా తనిఖీ చేసి ప్రయాణించాలని ఉత్తర రైల్వే ప్లాట్‌ఫారమ్ ఎక్స్‌లో పేర్కొంది.

నియంతృత్వం దిశగా బిజెపి పాలన


- ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎపి షా



న్యూఢిల్లీ : ప్రజాస్వామ్య వ్యవస్థలను ఉపయోగించుకుని బిజెపి నియంతృత్వం దిశగా పయనిస్తోందని ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎపి షా విమర్శించారు. న్యాయస్థానాలను, మీడియాను నిర్వీర్యం చేయడం, భిన్నాభిప్రాయాలను అణిచివేయడం ఆ ధోరణికి నిదర్శనం అని అన్నారు. మైనారిటీలు భయంతో జీవిస్తుంటే... కోర్టులు చూస్తూ ఉన్నాయని అన్నారు. మనుస్మృతికి మద్దతుగా వాదించే న్యాయమూర్తులు మెజారిటీ భాష మాట్లాడుతున్నారని అన్నారు. బిజెపిని 'ఎన్నికైన నియంతృత్వం'గా అభివర్ణించిన ఆయన, విడి సావర్కర్ కాలం చెల్లిన హిందుత్వ ఆశయాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని నూహ్, ఢిల్లీ అల్లర్లతోపాటు, న్యాయవ్యవస్థను సవాలు చేసే బుల్డోజర్ రాజకీయాలను కూడా ఆయన విమర్శించారు. అణగారిన ప్రజల జీవితాలను పునర్నిర్మించడానికి ఎవరు సహాయం చేస్తారు? అని అన్నారు. దీనిని ప్రశ్నించిన పంజాబ్ - హర్యానా హైకోర్టు బెంచ్ నుంచి కేసు బదిలీ చేయబడింది కూడా అని గుర్తు చేశారు. మానవ హక్కుల కార్యకర్తలపై వేటు వేసే పాలనకు మద్దతిచ్చేలా సుప్రీం కోర్టు తరచూ చేస్తున్న చర్యలను విమర్శిస్తూ తీస్తా సెతల్వాద్ ఉదంతమే ఇందుకు మంచి ఉదాహరణ అని పేర్కొన్నారు.

498-ఎ దుర్వినియోగం చేస్తున్నారట!

- మహిళలపై న్యాయస్థానాల వ్యాఖ్యలు
- తప్పుడు ఆరోపణల కేసులు తక్కువేనంటున్న ఎన్‌సిఆర్‌బి
- ఇప్పటికీ గృహిణులకు అదే సెక్షన్ కింద రక్షణ



న్యూఢిల్లీ : భర్త లేదా అతని తరపు బంధువులు వేధింపులకు పాల్పడుతున్నారంటూ కొందరు మహిళలు తప్పుడు కేసులు పెడుతున్నప్పటికీ వారికి రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన ఐపీసీ 498-ఏ సెక్షన్‌కు ఉన్న ప్రాధాన్యత విస్మరించరానిది. ఇటీవలి కాలంలో ఐపీసీ సెక్షన్ 498-ఏ దుర్వినియోగంపై న్యాయస్థానాలు విచారం వ్యక్తం చేస్తూనే మహిళలకు వ్యతిరేకంగా అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తున్నాయి. దీనిపై మహిళా హక్కుల కోసం పోరాడుతున్న సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌కు లేఖ కూడా రాశారు. సమస్యను సార్వత్రికం చేస్తూ కొందరు న్యాయమూర్తులు అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. ఐపీసీ 498-ఏ సెక్షన్‌ను ఆధారంగా చేసుకొని ఓ మహిళ దాఖలు చేసిన కేసులో కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ షుబేందు సామంత్ చేసిన వ్యాఖ్యలను ఇందిరా జైసింగ్ ఆ లేఖలో ప్రస్తావించారు. ఇంతకీ సామంత్ ఏమన్నారంటే...మహిళలు ఆ సెక్షన్‌ను దుర్వినియోగం చేస్తూ చట్టపరంగా అత్తింటి వారిని భయపెడుతున్నారట !

కఠిన నిబంధనలు

భార్య పట్ల అమానుష ప్రవర్తన, వరకట్న సంబంధమైన మరణాలు వంటి ఘటనలు పెరగడంతో 1983లో ఐపీసీలో 498-ఏ సెక్షన్‌ను చేర్చారు. 2005లో గృహ హింస చట్టం అమలులోకి వచ్చే వరకూ ఈ సెక్షనే మెట్టింటి వారి వేధింపుల నుంచి మహిళలకు రక్షణ కల్పించింది. ఈ సెక్షన్ కింద కేసు పెడితే నిందితుడికి బెయిల్ లభించదు. వారెంట్ లేకుండానే పోలీసులు అరెస్ట్ చేయవచ్చు. భర్త లేదా అతని బంధువులు మహిళను వేధించినట్లు రుజువైతే మూడు సంవత్సరాల కారాగార శిక్ష పడుతుంది. వరకట్న వేధింపుల నుంచి కాకుండా అమానుష చర్యల నుండి కూడా ఈ సెక్షన్ మహిళను కాపాడుతోంది. ఇలాంటి సెక్షన్ దుర్వినియోగం కాకుండా చూడడానికి గత కొన్ని సంవత్సరాలుగా న్యాయస్థానాలు అనేక ఆదేశాలు జారీ చేశాయి. అయితే ఈ ఆదేశాలు చట్టం యొక్క ప్రాధాన్యతను ఏ మాత్రం తగ్గించలేదు.

దుర్వినియోగంపై వ్యాఖ్యలు

సెక్షన్ 498-ఏ దుర్వినియోగంపై కొన్ని న్యాయస్థానాలు చేసిన వ్యాఖ్యలను పరిశీలిస్తే... ఈ సెక్షన్‌ను దుర్వినియోగం చేయడం ద్వారా మహిళలు చట్టపరంగా మెట్టింటి వారిని భయపెడుతున్నారని కలకత్తా హైకోర్టు తెలిపింది. భర్త బంధువులు వారితో కలసి నివసించకపోయినప్పటికీ ఇలాంటి అనేక కేసులలో వారిని కూడా నిందితులుగా చేరుస్తున్నారని బాంబే హైకోర్టు ఎత్తిపొడిచింది. శారీరక హింస, వరకట్న డిమాండ్లపై భర్య చెబుతున్న మాటలలో వైరుధ్యాలు కన్పిస్తున్నాయని, భర్త కుటుంబంపై కక్ష తీర్చుకోవడానికే ఇలాంటి కేసులు పెడుతున్నారని ఉత్తరప్రదేశ్‌లోని ఓ కోర్టు వ్యాఖ్యానించింది. ఓ కేసులో అలహాబాద్ హైకోర్ట్ ఏం చెప్పిందంటే...'ప్రతి కేసులోనూ వరకట్న వేధింపుల ఆరోపణలు చేస్తున్నారు. అనేక మంది సహజీవనానికి ఇష్టపడుతున్నారు. దీనికి ఎలాంటి చట్టబద్ధమైన కట్టుబాట్లు, ఒత్తిడులు ఉండవు'.

తప్పుడు కేసులు తక్కువే

జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక-2021 ప్రకారం మహిళలపై నేరాలకు సంబంధించి 4,28,278 కేసులు నమోదు కాగా వాటిలో 1,36,234 కేసులు (33%) సెక్షన్ 498-ఏకు సంబంధించినవే. వీటిలో కేవలం 6,938 మాత్రమే తప్పుడు కేసులని పోలీసుల విచారణలో తేలింది. అంటే నమోదైన కేసులలో తప్పుడు కేసులని తేలినవి చాలా తక్కువ. తాజాగా జరిపిన కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) ప్రకారం దేశంలో 18-49 సంవత్సరాల మధ్య వయసున్న మహిళల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు భర్త చేతిలో ఏదో ఒక రూపంలో అవమానాలకు గురవుతున్నారు. వివాహిత మహిళల్లో 32% మంది భర్త నుండి వేధింపులు ఎదుర్కొంటున్నారు.

అనేక అవరోధాలు

మెట్టింటి వారి వేధింపులకు గురవుతున్న గృహిణులు కోర్టులో 498-ఏ సెక్షన్ కింద కేసు పెట్టడం అంత సులభమైన విషయమేమీ కాదు. ఎందుకంటే పోలీసులు ఇలాంటి కేసులను కుటుంబంలో తలెత్తిన వివాదంగానే పరిగణిస్తున్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందే భార్యాభర్తలకు నచ్చచెప్పి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు. కొన్ని సందర్భాలలో కుటుంబ పరువు పోతుందనో, ప్రజలలో తలవంపులు తప్పవనో భయపడి బాధిత మహిళలు కేసులను వెనక్కి తీసుకుంటున్నారు. ఒకవేళ కేసు ముందుకు సాగినా, సరైన ఆధారాలు లేక వీగిపోతోంది. ఎందుకంటే మహిళలను మానసికంగా, భావోద్వేగపరంగా హింసించినట్లు నిరూపించడం చాలా కష్టం. సామాజికంగా ఒత్తిడులు వచ్చినప్పుడు లేదా విడాకులు మంజూరైన సందర్భాలలో మహిళలు విధిలేని పరిస్థితుల్లో పుట్టింటికి వెళతారు. అలాంటప్పుడు కేసును ముందుకు తీసికెళ్లడం మహిళలకు కష్టమవుతుంది. విచారణ నత్తనడక నడుస్తుంది. నిందితుడికి శిక్ష పడడం చాలా కష్టం. వీటన్నింటి కంటే ముఖ్యమైన విషయం ఏమంటే చాలా మంది మహిళలకు న్యాయ పోరాటం చేయడం అంత తేలికైన విషయం కాదు. పైగా వారి ఆర్థిక పరిస్థితి అందుకు సహకరించదు. వాస్తవాలు ఇలా ఉంటే మహిళలు ఐపీసీ 498-ఏని దుర్వినియోగం చేస్తున్నారంటూ అభాండాలు మోపడం ఏ విధంగా చూసినా సమర్థనీయం కాదు.




మీకోసం

రెండు స్పూన్ల నిమ్మ ఉప్పు, అదే కొలతతో సాధారణ ఉప్పు, కొంచెం వేడినీళ్లు, కాస్తంత డిటర్జెంట్ వాటర్‌తో ద్రావణం తయారుచేసుకుని ఇత్తడి, రాగి పాత్రలు తోమితే తళతళ మెరిసిపోతాయి.

జీవన సౌరభం

ప్రతి అనుభవం ఎక్కడో ఒక చోట ఉపయోగపడుతుంది. ఏ అనుభవం సులువుగా రాదు.

గురువందనం



కనిపించే దేవుడు
లోకమందున గురువు
నడిపించు నాయకుడు
నీడనిచ్చే తరువు

విజ్ఞాన జ్యోతితో
అజ్ఞానము బాపును
ఎనలేని నీతితో
జీవితాలు దిద్దును

గురు దేవుల మేధలో
జ్ఞాననిధి ఉన్నది
వారి చేయు బోధలో
అమృతభాండమున్నది

గురు దేవులు లేనిచో
జగతి ప్రగతి శూన్యం
వారి ఆవశ్యకత
అవనిలో అనివార్యం

గురువంటే భానుడు
చీకటిని పోగొట్టు
సాటిలేని యోధుడు
గమ్యాన్ని చూపెట్టు

సమ సమాజ స్థాపకుడు
అందరి ప్రేమికుడు
విద్యను అందించే
విజ్ఞాన సంపన్నుడు

పూజనీయుడు గురువు
సత్యాన్ని బోధించు
భువిలో కల్పతరువు
చేతులను జోడించు

అక్షరాల వనిలో
తోటమాలి అతడు
బహు గౌరవనీయుడు
ఆరాధనపాత్రుడు

- గద్వాల సోమన్న,
9966414580.



కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ నవ్వుతూ ఉన్న స్మైలీ బొమ్మల్లో ఒకటి మాత్రం భిన్నంగా ఉంది. దాన్ని కనిపెట్టండి చూద్దాం..



నేను గీసిన బొమ్మ





ఉమేరా తబసం,
6వ తరగతి,
జడ్పీ హెచ్ యస్ హవేళి ఘణపూర్,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఉడిపి చేనేతపై మమత



ఆదరించేవారు కరువై చాలీచాలని సంపాదనతో ఎన్నో కళల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వాటిల్లో ఒకటే కర్నాటకకు చెందిన ఉడిపి కళ. ఏకదారంలో సున్నితమైన పోగులతో ఎంతో హాయిగొల్పే ధారణకు ఉడిపి చీరలు పెట్టింది పేరు. కాటన్ ప్రపంచంలో ఒకప్పుడు ఉడిపి చీరలు గొప్పగా వెలుగొందాయి. జిఐ ట్యాగ్‌తో ప్రభుత్వ గుర్తింపు కూడా వచ్చింది. కానీ కాలక్రమేణా ఆ చీరలు మార్కెట్లో మాయమయ్యాయి. ఉడిపి చీరలను మక్కువగా ధరించే ఎంతోమంది అయ్యో అని బాధపడ్డారు. కానీ, మమతారాయ్ అలా ఊరుకోలేకపోయారు. తరచూ ఉడిపి చీరలను ధరించే ఆమె 2016లో విక్రయించిన చీరే ఆఖరిది అని దుకాణ యజమాని చెప్పడంతో ఎంతో తల్లడిల్లారు. ఎలాగైనా ఆ కళను పునరుద్ధరించాలని కంకణం కట్టుకున్నారు.

ఉడిపి చీరలు 1844 సంవత్సరం నాటికే ఉనికిలో ఉన్నాయి. కాలక్రమేణా బాసెల్ మిషన్‌తో మలబార్ ఫ్రేమ్స్ లూమ్స్ పరిచయమై, దక్షిణ కన్నడనాట ఉడిపి జిల్లాల్లో చేనేత ముఖ్య ఆదాయవనరుగా రూపాంతరం చెందింది. దీంతో ఎంతోమంది ఉడిపి చేనేత కార్మికులకు పని లేకుండా పోయింది. ఆదాయం లేక వారంతా క్రమంగా కళ నుండి నిష్క్రమించారు.

ఈ విషయం గ్రహించిన మమతా 2018లో 'కడకీ' ట్రస్ట్‌ని స్థాపించారు. ఆ నేత కార్మికులకు చేయూతగా నిలిచారు. అయితే ఇదంతా అంత సులభంగా జరగలేదు. నేత సొసైటీలను ఎన్నింటినో సందర్శించినా ఉడిపి కళాకారులను గుర్తించడం చాలా కష్టమైంది. అతి కష్టం మీద రెండు జిల్లాలకు గాను 45 మంది నేత కార్మికులను గుర్తించారు. అయితే వారంతా వృద్ధ కళాకారులు. 50 ఏళ్లు పైబడిన వారు. వారి మాటల్లో కూడా భవిష్యత్తు మీద ఎటువంటి ఆశలేని నిరాశ ప్రతిధ్వనించింది. ఈ విషయం కూడా ఆమెని కంటి మీద కునుకులేకుండా చేసింది. వీరి తరువాత ఆ కళ శాశ్వతంగా కనుమరుగైపోతుందన్నది ఆమె బెంగ. అందుకే దీన్ని ఉపాధిమార్గంగా మార్చాలని, యువ నేత కార్మికులను ఈ కళవైపు మళ్లించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



'నేత కార్మికులను ప్రోత్సాహించాలంటే ఈ చీరలకు మార్కెట్ కల్పించాలి. అందుకు మేము సోషల్ మీడియా వేదికలను ఉపయోగించుకున్నాం. రెండు జిల్లాల్లో ఎగ్జిబిషన్లు, ఆర్గానిక్ ఉత్పత్తుల స్టాల్స్‌లో పాల్గొని చీరలను విక్రయించేవాళ్లం. ఆన్‌లైన్ ద్వారా చీరల అమ్మకం విరివిగా జరిగితే నేతన్నకు బహుమతులు అందించడం, అదనపు జీతాలు, వైద్య సదుపాయాలు వంటివన్నీ కల్పించడం మొదలుపెడతామని భరోసా కల్పించాం. సహజసిద్ధ ఉత్పత్తులతో, సున్నితమైన పోగులతో తయారైన ఈ చీరలను గతంలో రూ.500 నుండి రూ.750 లకే అమ్మేవారు. కానీ ట్రస్ట్ చొరవతో రూ.1100 నుండి రూ.2300 ధర పలుకుతున్నాయి. ఇది నేతన్నలకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుంద'ని మమతా రాయ్ చెబుతున్నారు.



మూడు దశాబ్దాలుగా కొత్త నేత కార్మికులు ఈ కళ వైపు చూడలేదు. 50 ఏళ్ల లోపు వారితో 25 మంది సభ్యులతో శిక్షణా తరగతులను నిర్వహించాలని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఆచరణలో దీనికి పెద్దగా ఆదరణ రాలేదు. దీంతో 'కడకి' ట్రస్ట్ 15 రోజుల శిక్షణా తరగతులను 6 గురు నేత కార్మికులతో నిర్వహించడం మొదలుపెట్టింది. మొదట్లో నేతన్నలు ఇటువైపుగా రాలేదు. అయినా నిరుత్సాహపడకుండా ముందుకే సాగింది. 2020 నాటికి నాబార్డు చొరవతో 20 మందికి తక్కువగా శిక్షణ ఇప్పించే ఒప్పందంతో తరగతులు ప్రారంభించింది. మొదటిబ్యాచ్‌లో 5 గురు వచ్చారు.

రెండు నెలలపాటు శిక్షణా తరగతులు నిర్వహించారు. 'ప్రస్తుతం డిజైన్ స్కూల్స్ నుండి కొంతమంది విద్యార్థులు మమ్మల్ని సంప్రదిస్తున్నారు. ఈ మార్పు వల్ల మాకు చాలా సంతోషంగా ఉంటోంది. ఈ పరిణామం నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతుంది. కళ అంతరించిపోకుండా ఒకరి నుండి మరొకరికి బదిలీ అవుతుంది' అని మమతా చెబుతున్నప్పుడు ఆమె మాటల్లో ఎంతో సంతోషం ధ్వనించింది. ఐదు నెలల క్రితం ఉడిపి జిల్లా పంచాయతి, ఉడిపి సొసైటీ, వేవర్ కమ్యూనిటీలు 25 మంది సభ్యులతో శిక్షణా తరగతులను ప్రారంభించినట్లు కూడా ఆమె చెబుతున్నారు. కళ, కళాకారులు కనుమరుగవ్వకుండా ఉండాలంటే మమతా లాంటి వారు చొరవ చూపాలి. అప్పుడే ప్రాచీన కళలు సజీవంగా ఉంటాయి. ఆ దిశగా అడుగులు వేసిన మమతారాయ్ ఇప్పుడు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

హనుమాన్ గుడిలో ముస్లిం అర్చకత్వం!

హిందూ దేవాలయాల్లో ముస్లింలు, మసీదుల్లో హిందువులు సేవలు చేయడం గురించి చాలా సార్లు విన్నాం. ఆలయ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచడం, మొక్కలకు నీళ్లు పోయడం, ప్రసాదాలు చేసి ఇవ్వడం, పండుగలప్పుడు భోజనాలు సమకూర్చడం.. ఇలా ఒకటేమిటి ఎన్నో పనుల్లో హిందూ, ముస్లింలు ఐక్యమత్యంగా మెలగడం చూశాం. ఇప్పుడు చెప్పుకుంటున్నది కూడా అటువంటి విషయమే అయినా, ఇక్కడ ఒక విశేషం ఉంది. సాధారణంగా ఆలయ పూజా నిర్వహణలను నిర్వహించే అర్చకులుగా ముస్లిం వ్యక్తులు కనపడుతున్నారు. ఇలా ఒకటి, రెండు కాదు.. 150 ఏళ్ల నుండి చేస్తున్నారు. కర్నాటక గడగ్ జిల్లా కొరికొప్ప హనుమ ఆలయంలో ఈ దృశ్యం కనపడుతోంది. ప్రస్తుతం శ్రావణ మాసం సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది ప్రజలు అక్కడికి హాజరవుతున్నారు. పూజలు, హోమాలు, తదితర క్రతువులను హిందువులు, ముస్లింలు ఏకమై నిర్వహిస్తున్నారు.

ఇప్పుడు అక్కడ కొరికొప్ప గ్రామం ఒక్కటే కనపడుతోంది. కానీ ఒకప్పుడు కోనెరికొప్ప, కొండికొప్ప, కొరికొప్ప గ్రామాలు కలిసి ఉండేవి. గ్రామ పొలిమేర్లలో చిన్న హనుమ ఆలయం ఉండేది. ప్లేగు, కలరా వ్యాధులు ప్రబలి గ్రామస్తులంతా వలస వెళ్లిపోయారు. దీంతో కొరికొప్ప గ్రామం ఒక్కటే మిగిలివుంది. ఆ సమయంలో ఇక్కడి హనుమ ఆలయంలో పూజలు చేసేందుకు పుటగౌన్ బద్ని గ్రామం నుంచి వచ్చిన ముసుములు ముందుకు వచ్చారు. వ్యాధులకు భయపడి గ్రామాలకు గ్రామాలు కదిలి వెళ్లిపోయినా ముస్లిం వ్యక్తులు పూజలు చేయడం గ్రామస్తులను ఆశ్చర్యపర్చింది. సాంప్రదాయం పోకుండా వారు చేసిన పనికి కృతజ్ఞతగా ఆ రోజు నుండి పూజా క్రతువులన్నీ ముస్లిం వ్యక్తులనే చేయమని గ్రామ పెద్దలు నిర్ణయించారు. అది ఈ రోజు వరకు నిరాటంకంగా సాగుతోంది. ఇది కదా, మతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనం.



జుట్టు .. కనికట్టు

పాత్రోచితంగా హెయిర్ స్టయిళ్ల మార్పు.. తెలుగు తెరపై సరికొత్త సరళి



సినిమాలు బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురవాలంటే, ప్రతి సినిమాలోనూ ఏదొక కొత్తదనం చూపించాల్సి వస్తోంది. ఇవన్నీ దష్టిలో పెట్టుకుని మన హీరోలందరూ సరికొత్త కథలతో పాటుగా దుస్తులు, మేకప్‌ల విషయంలోనూ ప్రయోగాలు చేస్తున్నారు. ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు చేసేందుకు ఈ మధ్య సరికొత్త హెయిర్ స్టైల్‌లో దర్శనమిస్తున్నారు. అందం, అభినయంతో పాటుగా పాత్రకి తగ్గట్టుగా శరీరాకృతి ఉండేలా చూసుకుంటున్నారు. దీనికి మంచి హెయిర్ స్టైల్ కూడా తోడైతే, తెరపైన మరింత సరికొత్తగా కనిపిస్తారు. తెలుగు హీరోలు ఒక్కో సినిమాలో ఒక్కోలా, పాత్రోచితంగా లను హెయిర్ స్టైల్‌ను కొనసాగిస్తున్నారు. తెలుగు పరిశ్రమలో ప్రస్తుతం రింగుల జుట్టు ట్రెండ్ నడుస్తోంది. మాసీ లుక్ కోసం రింగులు తిరిగిన జుట్టుతో పాటుగా గుబురు గడ్డాన్ని పెంచుతున్నారు. మునుపెన్నడూ చూడని సరికొత్త క్రాప్‌లు, మేకప్‌లతో ఆకట్టుకుంటున్నారు.











అల్లు అర్జున్ 'పుష్ప' సినిమాలో పుష్పరాజ్ అనే పాత్ర కోసం రింగు రింగుల జుట్టు, గుబురు గడ్డం, మాసిన చొక్కా, మెడలో తాయత్తుతో మాస్ లుక్‌తో కనిపించి, అలరించాడు. శేషాచలం అడవుల్లో కూలీగా జీవనం సాగించే యువకుడు ఇలానే ఉంటాడా అని అనుకునే విధంగా మారిపోయాడు. ఈ సినిమాలో నటనకు అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడు అవార్డు లభించింది. ప్రస్తుతం సెట్స్ మీదున్న 'పుష్ప 2: ది రూల్' చిత్రంలోనూ బన్నీ రింగుల జుట్టుతోనే కనిపించనున్నాడు. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ మూవీ వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

'దసరా' సినిమాలో హీరో నాని రింగులు తిరిగిన చింపిరి జుట్టు, మాసిన గడ్డం, చెవికి పోగుతో సరికొత్తగా కనిపించాడు. తొలిసారిగా ధరణి అనే రా అండ్ రస్టిక్ క్యారక్టర్‌తో ఆకట్టుకున్నాడు.

'ఏజెంట్' మూవీలో అఖిల్ అక్కినేని హార్డ్ వర్కౌట్స్‌తో సిక్స్ ప్యాక్ బాడీతోపాటుగా పొడవాటి ఉంగరాల జుట్టుతో స్టైలిష్‌గా కనిపించాడు. హాలీవుడ్ హీరోలకు ఏమాత్రం తీసిపోని స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నాడు.

'డీజే టిల్లు' సినిమా కోసం హీరో జొన్నలగడ్డ సిద్ధు పూర్తిగా తన హెయిర్ స్టైల్‌ను మార్చేశాడు. ఇందులో 'అట్లుంటది మనతోని' అనే అతడి యాటిట్యూడ్ యూత్‌ని బాగా ఆకట్టుకుంది. దీనికి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న 'టిల్లు స్క్వేర్' సినిమాలోనూ కర్లీ హెయిర్‌తోనే కనిపించనున్నాడు.

హీరో ఆశిష్ రెడ్డి 'సెల్ఫిష్' సినిమా కోసం రింగులు తిరిగిన జుట్టుతో కనిపించనున్నాడు.

'లైగర్' సినిమాలో హీరో విజయ్‌దేవరకొండ రింగులు తిరిగిన పొడవాటి హెయిర్ స్టైల్‌తో కనిపించాడు.

రామ్ పోతినేని హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'స్కంద' సినిమాలో రాపో ఒత్తుగా ఉండే ఉంగరాల జుట్టు, గడ్డంతో కనిపించనున్నాడు.

యాంకర్ సుమ, నటుడు రాజీవ్ కనకాల కొడుకు రోషన్ హీరోగా పరిచయం అవుతున్న సినిమాలో రింగుల జుట్టుతో కనిపించనున్నాడు.

సూపర్ 4 వేదికల మార్పు?

కొలంబోలో వర్ష సూచనలే కారణం ● భారత్, పాక్ మ్యాచ్ ప్రతికూల ప్రభావం



కొలంబో : వాతావరణ పరిస్థితులు క్రికెట్‌ను ఎల్లప్పుడూ శాసిస్తున్నాయి. ఎంతో సాంకేతికత అందుబాటులోకి వచ్చినా.. వరుణ గండం నుంచి గట్టెక్కే మార్గం అంతర్జాతీయ క్రికెట్ కమిటీ (ఐసీసీ)కి చిక్కటం లేదు. ఆట, వినోదంతో పాటు వాణిజ్య విలువలు ముడిపడిన క్రికెట్.. అనూహ్య వాతావరణ మార్పులతో ఇబ్బందులు ఎదుర్కొంటుంది. భారత్, పాకిస్థాన్ ఆసియా కప్ గ్రూప్ దశ మ్యాచ్ ఇందుకు చక్కటి నిదర్శనం. అంచనాల ప్రకారం, మ్యాచ్ ఆరంభానికి ముందు మాత్రమే వర్షం కురిసే సూచనలు కనిపించాయి. మ్యాచ్ సమయంలో ఎటువంటి వర్షం సూచనలు లేవని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. అయినా, భారత ఇన్నింగ్స్‌లో రెండు సార్లు అంతరాయం కలిగించిన వర్షం.. పాకిస్థాన్ ఇన్నింగ్స్ ఆరంభానికి అవకాశమే ఇవ్వలేదు. దీంతో ఉత్కంఠరేపిన దాయాదుల సమరం ఫలితం తేలకుండా ముగిసింది. ప్రసారదారు స్టార్‌స్పోర్ట్స్‌కు ఇది తీరని నష్టం తీసుకొచ్చిందని సమాచారం. సూపర్ 4 దశ మ్యాచులకు సైతం వరుణ గండం ఉండటంతో.. భారత్, పాకిస్థాన్ మ్యాచ్ తరహా పరిస్థితులు పునరావృతం కాకుండా నివారించేందుకు.. వేదికలను మార్చేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నట్టు తెలుస్తుంది!.

కొలంబోకు వర్షం ముప్పు : సూపర్ 4 దశలో భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు కొలంబో వేదిక కానుంది. ఇక్కడి ఆర్. ప్రేమదాస స్టేడియం దాయాదుల సమరానికి ఆతిథ్యం ఇవ్వనుంది. అయితే, ఆ రోజు సైతం వాతావరణం అనుకూలంగా లేదు. రానున్న వారం రోజుల్లో కొలంబోను వరుణుడు ముంచెత్తనున్నాడు. అదే జరిగితే.. ఆసియా కప్ ప్రసారదారుకు భారీ నష్టాలు మిగల్చటం ఖాయం!. అభిమానులూ తీవ్ర నిరాశకు లోనవుతారు. అందుకే.. సూపర్ 4 దశలో కొలంబోలో జరగాల్సిన మ్యాచులను దంబుల్లా, హంబన్‌టోట స్టేడియాలకు రీ షెడ్యూల్ చేయాలనే ఆలోచన నిర్వాహకుల్లో ఉంది. నాలుగు జట్లకు వసతి, బస సహా ప్రసారదారు, అభిమానుల ఏర్పాట్లు ఇప్పటికప్పుడు ఖాయం చేయటం అంత సులువు కాదు. కానీ, ప్రసారదారు స్టార్‌స్పోర్ట్స్ వేదికల మార్పుకు పట్టుబట్టినట్టు ఏసీసీ వర్గాలు చెబుతున్నాయి. ఓ టోర్నీ ఆరంభమైన అనంతరం.. షెడ్యూల్‌లో మార్పులు చేసిన దాఖలాలు పెద్దగా లేవు. తొలిసారి ఆసియా కప్‌లో షెడ్యూల్‌ను టోర్నీ మధ్యలో మార్చేందుకు రంగం సిద్ధమవుతోంది.

కాసుల కక్కుర్తి! : భద్రతా కారణాల రీత్యా పాకిస్థాన్‌లో పర్యటించేందుకు భారత జట్టు నిరాకరించగా... గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆసియా కప్‌ను శ్రీలంకలో నిర్వహించేందుకు ఆతిథ్య పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సమ్మతించింది. ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్ మెగా మ్యాచ్ ద్వారా ఆదాయం ఆర్జించాలనే దురాలోచన శ్రీలంక క్రికెట్ బోర్డు చేసింది. దీంతో తొలిసారి భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు స్టాండ్స్‌లో కుర్చీలు ఖాళీగా కనిపించాయి. సాధారణ స్టాండ్స్‌కు రూ.10000, గ్రాండ్ స్టాండ్స్‌కు రూ.42500 (శ్రీలంక రూపాయలు) వసూలు చేశారు. శ్రీలంకలో సాధారణ స్టాండ్స్ టికెట్ ధర రూ. 250, గ్రాండ్ స్టాండ్స్ టికెట్ ధర రూ.1250 మాత్రమే. కానీ భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు సుమారు 80 రెట్లు అధిక ధరలకు టికెట్లను అమ్ముకున్నారు. అసలే ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో.. ఈ స్థాయిలో టికెట్ ధరలను నిర్ణయించి అభిమానుల ఆశలపై నీళ్లు చల్లారని శ్రీలంక క్రికెట్ బోర్డుపై విమర్శలు వస్తున్నాయి. శ్రీలంక, బంగ్లాదేశ్ మ్యాచ్‌కు సైతం స్టేడియంలో పెద్దగా అభిమానులు కనిపించలేదు. అందుకు సైతం అధిక టికెట్ ధరలే కారణం.



మనోళ్లు ముగ్గురు

డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు అర్హత
సెప్టెంబర్ 16, 17న పతక వేట

యూజీన్ (అమెరికా) : ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు భారత్ నుంచి ముగ్గురు అథ్లెట్లు అర్హత సాధించారు. సెప్టెంబర్ 16, 17న అమెరికాలోని యూజీన్‌లో జరుగనున్న ఫైనల్స్‌లో భారత్ నుంచి ముగ్గురు అథ్లెట్లు పతక వేటలో నిలువనున్నారు. ప్రపంచ జావెలిన్ త్రో సూపర్‌స్టార్, భారత అథ్లెటిక్స్ హీరో నీరజ్ చోప్రా సహా స్ప్రింటర్ అవినాశ్ సబ్లె, జంపర్ మురళీ శ్రీశంకర్‌లు డైమండ్ లీగ్ ఫైనల్లో పోటీపడనున్నారు. ప్రపంచ అథ్లెటిక్స్‌లో డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు ప్రత్యేకత ఉంది. 14 పోటీల సిరీస్ అనంతరం అగ్రస్థానంలో నిలిచిన అథ్లెట్లు మాత్రమే డైమండ్ లీగ్‌కు అర్హత సాధిస్తారు. ఈ ఏడాది మే నెలలో మొదలైన డైమండ్ లీగ్ పోటీలు.. ఈ సెప్టెంబర్‌తో ముగియనుంది. డైమండ్ లీగ్‌లో 16 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. ప్రతి టోర్నీ (14 టోర్నీలు)లో విజేతలుగా నిలిచిన అథ్లెట్లకు వరుసగా 8, 7, 6, 5, 4, 3, 2, 1 చొప్పున పాయింట్లను కేటాయిస్తారు. చాంపియన్‌కు ఎనిమిది పాయింట్లు దక్కగా.. ఎనిమిదో స్థానంలో నిలిచిన అథ్లెట్‌కు ఒక్క పాయింట్ దక్కుతుంది. 14 టోర్నీలు ముగిసిన అనంతరం సాధించిన పాయింట్ల ఆధారంగా ఫైనల్స్‌కు అర్హత సాధించిన అథ్లెట్లను తేల్చుతారు. ఒలింపిక్, వరల్డ్ చాంపియన్ నీరజ్ చోప్రా.. దోహా, లాసానె, జ్యూరిచ్‌లలో మాత్రమే పోటీపడ్డాడు. జాకబ్ (చెక్ రిపబ్లిక్) 29, జులియన్ వెబర్ (జర్మనీ) 25 తర్వాత నీరజ్ చోప్రా 23 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు చేరుకున్నాడు. ఇక లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ 14 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. 3000మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో అవినాశ్ సబ్లె ఆరో స్థానంతో ఫైనల్స్‌కు చేరుకున్నాడు. మూడు టోర్నీల్లో పోటీపడిన అవినాశ్ 11 పాయింట్లు సాధించాడు. ఇక ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్‌లో పసిడి పతకం దిశగా సన్నద్ధమవుతున్న నీరజ్ చోప్రా.. విదేశాల్లో శిక్షణ పొందుతుండగా.. అవినాశ్, శ్రీశంకర్ సైతం ఫైనల్లో పతకంపై కన్నేసి సాధన చేస్తున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68